మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 27-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 239 Issue: 239

27 ఫిబ్రవరి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:39 సూర్యాస్తమయం - సా. 6:18 తిథి ఏకాదశి రా. 10:34 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ఆరుద్ర ఉ. 10:47 వరకు తరువాత పునర్వసు యోగం ఆయుష్మాన్ రా. 7:44 వరకు కరణం వనిజ ఉ. 11:33 వరకు విష్టి రా. 10:34 వరకు వర్జ్యం రా. 10:11 నుండి రా. 11:42 వరకు దుర్ముహూర్తం ఉ. 8:59 నుండి ఉ. 9:45 వరకు మ. 12:52 నుండి మ. 1:38 వరకు రాహుకాలం ఉ. 11:01 నుండి మ. 12:28 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:51 వరకు గుళికాకాలం ఉ. 8:06 నుండి ఉ. 9:34 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:03 నుండి తె. 5:51 వరకు అమృత ఘడియలు లేదు అభిజిత్ ముహూర్తం మ. 12:05 నుండి మ. 12:52 వరకు

Published from Jagitial
www.evarthalu.com



హైడ్రాకు తెలంగాణ హైకోర్టు జరిమానా విధించింది. గతంలో ఇచ్చిన కోర్టు తీర్పులను ఉల్లంఘించి మల్లాపూర్‌లోని ఒక ప్రైవేట్ భూమికి ఫెన్సింగ్ వేసినందుకు హైడ్రాకు రూ. లక్ష జరిమానా విధిస్తున్నట్టుగా హైకోర్టు తెలిపింది. తక్షణం ఫెన్సింగ్ తొలగించాలని, లేనిపక్షంలో ఫెన్సింగ్ తొలగించేదాకా రోజుకు రూ.లక్ష చొప్పున పిటిషనర్లకు చెల్లించాలని ఆదేశించింది.

## ఫెన్సింగ్ వేసినందుకు రూ.లక్ష జరిమానా

### హైడ్రాకు హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా ఉప్పల్ మండలం మల్లాపూర్‌లోని బాబానగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ లేఔట్‌లోని 184,185 ప్లాట్‌కు హైడ్రా కంచె వేయడాన్ని సవాలు చేస్తూ జొన్నలగడ్డ పద్మిని మరొకరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేశారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి తరువాయి 2 వ పేజీలో...



ఎన్‌సీఈఆర్టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం బుక్‌లో న్యాయవ్యవస్థపై వివాదాస్పద పాఠ్యాంశం ఉన్న కేసులో ఇవాళ సుప్రీంకోర్టు(ాబజూతీవఎవ జశీబతీ) కీలక ఆదేశాలు ఇచ్చింది. ఆ బుక్‌ను బ్యాన్ చేస్తూ ఇవాళ సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో అవినీతి అన్న అంశంతో ఉన్న ఆ బుక్‌కు చెందిన కాపీలను సీజ్ చేయాలని కూడా సుప్రీం ధర్మాసనం తన ఆదేశాల్లో పేర్కొన్నది.

## 'న్యాయవ్యవస్థలో అవినీతి' పుస్తకం నిషేధం

### ఎన్సీఈఆర్టీపై సుప్రీం కోర్టు మండిపాటు

న్యూఢిల్లీ: సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలీతో కూడిన ధర్మాసనం ఈ కేసులో ఆదేశాలు ఇచ్చింది. చాలా లోతైన కుట్ర జరిగినట్లు కోర్టు చెప్పింది. ఎన్‌సీఈఆర్టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం పుస్తకాన్ని ప్రచురించిన బాధ్యతాయుత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోర్టు తరువాయి 2 వ పేజీలో...

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

### జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా

### విపత్తు నిర్వహణ స్పెషల్ సీఎస్‌గా దానకిషోర్



తెలంగాణలో మళ్లీ భారీగా ఐఏఎస్ అధికారుల ట్రాన్స్‌ఫర్లు చోటు చేసుకున్నాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు అయ్యారు. అదే సమయంలో ఆయనకు అదనపు బాధ్యతల కింద బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి పదవిని అప్పగించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్.. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌కు అవకాశం కల్పించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్.. దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు.. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పలు జిల్లా కలెక్టర్లకు ఈసారి స్థాన చలనం కల్పించారు.

**ఐఏఎస్‌ల బదిలీలు ఇలా..**

- సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శి – రాహుల్ బొజ్జా
- పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ – సంజయ్ కుమార్
- ఎస్పీడీసీఎల్ సీఎండీ – జితేశ్ వి. పాటిల్

తరువాయి 2 వ పేజీలో...

# యాక్షన్.. 99

### అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ

### డిప్యూటీ సీఎం భట్టి చైర్మన్‌గా ఏర్పాటు

### సభ్యులుగా దుద్దిళ్ల, ఉత్తమ్, పొంగులేటి



తెలంగాణలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలనలో వేగం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ నలుగురు కీలక మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): రాబోయే ఎన్నికల నాటికి ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు ఈ సబ్ కమిటీ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయనుంది. గ్రామీణ మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఈ ప్లాన్ ప్రధానంగా దృష్టి సారించనుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేసేలా ప్రభుత్వం యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ వ్యూహం ప్రకారం.. రాబోయే మూడు నెలల పాటు మంత్రులు, ఉన్నతాధికారులు తరువాయి 2 వ పేజీలో...



# సంతకాలు..27

### ఇజ్రాయెల్‌తో భారత్ కీలక ఒప్పందాలు

### అక్కడ త్వరలో యూపీఐ వినియోగం

ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన చాలా మంచి ఫలితాలను ఇచ్చిందని భారత ప్రభుత్వం వెల్లడించింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఉపయోగించి డిజిటల్ చెల్లింపులు సహా 27 రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంచిందని పేర్కొంది. ఈ మేరకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

జెరూసలెం:సాంకేతికత, ఆవిష్కరణలను సమ్మిళిత వృద్ధి కోసం వినియోగించాలనే ప్రధాని మోదీ నిబద్ధతను ఈ పర్యటన స్పష్టం చేస్తుందని విక్రమ్ మిస్త్రీ తెలిపారు. శాంతి, ఆవిష్కరణలు, ఇరుదేశాల శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య ఉన్న 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత ప్రభావవంతంగా మార్చడానికి ఇరువురు నేతలు (మోదీ,నెతన్యాహు) కట్టుబడి ఉన్నారని ఆయన తెలిపారు. అలాగే మోదీ ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా కుదిరిన అనేక తరువాయి 2 వ పేజీలో...



**బంగారం- వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.16,102 |
| వెండి (గ్రాము): | రూ.295 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,680 |

# సీఎంని కాదు.. పెద్దన్నను!

### నియామకాల అడ్డుకట్ట కుట్రలను ఛేదించాం

### ప్రభుత్వ ఉద్యోగులపై ఉన్న నానుడిని చెరిపేయాలి

### శిక్షణ పూర్తి చేసుకున్న గ్రూప్-1, 2 అధికారులతో సీఎం రేవంత్



తెలంగాణ రాష్ట్ర తొలి గ్రూప్-1, గ్రూప్-2 అధికారులుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న యువ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): ఈ సమావేశానికి తాను ముఖ్యమంత్రిగా కాకుండా, ఆ యువ అధికారులకు ఒక పెద్దన్నగా వచ్చానని, యాంత్రికంగా కాకుండా పూర్తి భావోద్వేగ బంధంతో మాట్లాడానని ఆయన తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్న యువ సోదర, సోదరీమణులను కలవడం గొప్ప అనుభూతినిచ్చిందని పేర్కొన్నారు. ఈ నియామకాలకు -2 వ పేజీలో...



# నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియం

### ఎప్ సెట్ రద్దు చేయాలి.. బీఎడ్‌ను పునర్వ్యవస్థీకరించాలి

### తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సులు

తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పుల కోసం ఏర్పాటైన విద్యా కమిషన్ తన ప్రతిష్టాత్మక నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేసింది. ఆకునూరి మురళి నేతృత్వంలోని ఈ కమిషన్ ప్రీ-ప్రైమరీ నుండి ఉన్నత విద్య వరకు విప్లవాత్మక మార్పులను ప్రతిపాదించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్" పేరుతో కొత్త నమూనాను కమిషన్ పరిచయం చేసింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): కొత్త భవనాల నిర్మాణానికి బదులుగా ఉన్న పాఠశాలలనే ఆధునికీకరించి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించింది. మొదటి దశలో 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 100 మండలాలను ఎంపిక చేసి 200 పాఠశాలలను ఈ నమూనాలోకి మార్చేందుకు ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదం తెలిపారు. ఈ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, అత్యాధునిక తరువాయి 2 వ పేజీలో...

**విశ్వవాణి**



యూరప్చరిత్రలో తొలిసారి అనేక దేశాలు రాజులకు బదులు రాణులు దేశాలను ఏలబోతున్నారు. స్పెయిన్, బెల్జియం, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్ దేశాలను రాణులే పాలించబోతున్నారు.


# వాహనాలపై రోడ్ సేఫ్టీ సెస్

### మార్చి 1 నుంచి అదనపు బాదుడు.. రవాణాశాఖ ఉత్తర్వులు జారీ

కొత్తగా వాహనాలు కొంటున్నారా..? అయితే మీ జేబుకు చిల్లు పడినట్లే. ఎందుకంటే రిజిస్ట్రేషన్ సమయంలోనే కొత్త అదనపు బాదుడుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త వాహనాల కొనుగోలుపై రోడ్ సేఫ్టీ సెస్ వసూలు చేయనున్నారు. ఈ మేరకు సెస్ చెల్లించే నిబంధన మార్చి 1 నుంచి అమల్లోకి రానుంది. మోటారు వెహికల్ యాక్ట్ చట్టంలో పన్నుల విధింపుపై రాష్ట్రానికి ఉన్న అధికారాల్ని వినియోగిస్తూ తెలంగాణ రవాణాశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.




హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం.. నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు అదనంగా రోడ్డు భద్రత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, కార్లతోపాటుగా ఇతర వ్యక్తిగత వాహనాలు, గూడ్స్ వెహికల్స్, ప్రయాణికుల్ని తీసుకెళ్లే ఆటోలు ఈ విభాగం పరిధిలోకి వస్తాయి. కొత్త తరువాయి 2 వ పేజీలో...



## పెళ్లి కట్టిన శుభవేళ..!

రాజస్థాన్‌లో అట్టహాసంగా విరోష్ వివాహం జరిగింది. గురువారం ఉదయం 10:10 గంటల శుభ ముహూర్తంలో విజయ్, రష్మికలు పెళ్లితో ఒక్కటయ్యారు.

# రాశి ఫలాలు
27.2.2026

మేషం: ఆలయ దర్శనాలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ప్రయాణాలలో అవరోధాలు ఉంటాయి. పనులలో ఆటంకాలు ఉన్న నిదానంగా పూర్తిచేస్తారు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్య విషయమై శ్రద్ధ అవసరం. వ్యాపారాలు మరింత నిరుత్సాహ పరుస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది.

వృషభం: దూర ప్రాంత బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు ఉండవు. వృత్తి ఉద్యోగాలలో అంచనాలను అందుకుంటారు. వ్యాపారాలలో తగిన లాభం పొందుతారు. నిరుద్యోగులకు మంచి ఉద్యోగ అవకాశములు లభిస్తాయి.

మిధునం: వ్యవహారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉన్నట్టుండి నిర్ణయాలలో మార్పులు చేసుకుని ఇబ్బంది పడతారు. ఉద్యోగమున పనిభారం పెరుగుతుంది. ఆధ్యాత్మిక విషయాలలో దృష్టి పెట్టడం మంచిది. బంధువర్గంతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ప్రయాణాలు కష్టంగా ఉంటాయి.

కర్కాటకం: కొత్త పనులు శ్రీకారం చుడతారు. దూర ప్రాంత బంధువుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుకుంటారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. సమాజంలో విలువ పెరుగుతుంది. విలువైన వస్తు, వస్త్ర, ధన లాభాలున్నాయి. వృత్తి, ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి.

సింహం: విందు వినోదాది కార్యక్రమాలలో విరివిగా పాల్గొంటారు. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. నిరుద్యోగులకు ఒక సమాచారం ఊరటను ఇస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. వ్యాపారాలలో కొత్త పద్ధతులు ప్రవేశపెడతారు. ఉద్యోగ విషయమై శుభవార్త అందుతుంది.

కన్య: ముఖ్యమైన పనులలో తొందరపాటు నిర్ణయాలు వలన ఆర్థిక నష్టాలు కలుగుతాయి. చేపట్టిన పనులు అవాంతరాలు కలిగి మధ్యలో నిలిచిపోతాయి. వివాదాలకు వెళ్ళకపోవడం మంచిది. ద్విస్వభావ ఆలోచనలు ఉంటాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

తుల: ప్రయాణాలు చికాకు కలిగిస్తాయి. సేవా కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కొన్ని పనులు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరం అవుతాయి. ఉద్యోగమున శ్రమ తప్పదు.

వృశ్చికం: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు లభిస్తాయి. సంతాన విద్యా విషయాలలో సంతృప్తి కలుగుతుంది. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. విభేదించినవారే దగ్గరవుతారు. ఉద్యోగమున అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: అప్రయత్నంగా పనులు పూర్తవుతాయి. సన్నిహితుల కలయిక సంతోషం కలిగిస్తుంది. చాలా కాలంగా వేచి చూస్తున్న అవకాశం లభిస్తుంది. వాహన కొనుగోలు అవరోధాలు తొలగుతాయి. ఉద్యోగ విషయమై ఇరుక్కున్న సమస్యల నుండి చాకచక్యంగా బయటపడతారు.

మకరం: కొన్ని వ్యవహారాలలో ముఖ్యమైన మార్పులు చోటుచేసుకుంటాయి. శ్రమతో ప్రయాణాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగములలో పని ఒత్తిడి పెరుగుతుంది. దైవ భక్తి పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించడం మంచిది. మిత్రుల నుండి సమస్యలు కలుగుతాయి.

కుంభం: ఇంటా బయట సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. ఆరోగ్యం అంతగా అనుకూలించదు. సన్నిహితులతో దూరంగా మెలగడం మంచిది. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. చేసిన పని మళ్ళీ మళ్ళీ చెయ్యవలసిన రావచ్చు. వృత్తి, వ్యాపారాలు ఆశించిన స్థాయిలో ఉండవు.

మీనం: ప్రయాణాలలో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. చాలా కాలంగా తీరని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో హోదా పెరుగుతుంది. వ్యవహారాలు ఉత్సాహంగా ఉంటాయి. బంధుమిత్రులతో అనుకూల వాతావరణం ఉంటుంది.







# సంతకాలు.. 27

**మొదటి పేజీ తరువాయి**

అవగాహనలు ఇరువైపులా యువత, వ్యాపారాలు, వ్యవస్థాపకులకు స్టార్టప్‌లు, టెక్నాలజీ, స్టెమ్ రంగాలలో కొత్త అవకాశాలను సృష్టిస్తాయని విక్రమ్ మిస్త్రీ అన్నారు. వ్యవసాయ రంగంలో ఇప్పటికే ఉన్న సహకారానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని చెప్పారు. ఇక, భారత్-ఇజ్రాయెల్ తమ సంబంధాన్ని ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకున్నాయి. త్వరలోనే పరస్పర ప్రయోజనకరమైన 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని' ఖరారు చేయాలని నిర్ణయించుకున్నాయి. అలాగే, మోదీ, బెంజమిన్ నెతన్యాహు మధ్య చర్చల తరువాత వాణిజ్యం, వ్యవసాయం, శక్తి, సైబర్‌స్పేస్, డిజిటల్ చెల్లింపు రంగాలలో సహకారాన్ని విస్తరించడానికి రెండు వైపులా అనేక ఒప్పందాలపై సంతకం చేశాయి. భారతదేశం తన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ని అధికారికంగా ఇజ్రాయెల్‌కు విస్తరించింది. ఇది ఇరుదేశాల మధ్య డిజిటల్ ఫైనాన్స్ సహకారంలో ఒక ప్రధాన మైలురాయిగా మారనుంది. అలాగే, ద్వైపాక్షిక సంబంధాలలో సాంకేతికత, ఆవిష్కరణలను ఏకీకృతం చేయడానికి విస్తృత ప్రోత్సాహాన్ని సూచిస్తుంది. ఈ మేరకు బెంజమిన్ నెతన్యాహుతో సమావేశం అనంతరం ప్రధాని మోదీ ప్రకటన చేశారు. నెతన్యాహుతో కలిసి జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మోదీ మాట్లాడుతూ... "మేము కీలకమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాము. ఇజ్రాయెలలో యూపీఐ వినియోగం కోసం ఒక ఒప్పందంపై సంతకం చేయడం నాకు సంతోషంగా ఉంది. పౌర అణుశక్తి, అంతరిక్ష రంగాలలో మేము మా పనిని మరింత ముందుకు తీసుకెళ్తాము. కలిసి, మేము ఫ్యూచర్ రెడీ వ్యవసాయ పరిష్కారాలను అభివృద్ధి చేస్తాము. శ్రేష్ఠమైన గ్రామాలను సృష్టించడంలో మేము పని చేస్తాం" అని మోదీ పేర్కొన్నారు. దీంతో త్వరలోనే ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

**మొదటి పేజీ తరువాయి**

ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ – ఈ. శ్రీధర్
ఐటీ అండ్ సీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ – ఎన్. శ్రీధర్
ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం సెక్రటరీ – గౌరవ్ ఉప్పల్
డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ–ఎం. దాన కిషోర్
ఫైనాన్స్ శాఖ స్పెషల్ సెక్రటరీ – సిక్తా పట్నాయక్
ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ – బి.ఎం. సంతోష్
లేబర్ స్పెషల్ కమిషనర్ – పమేలా సత్పతి
కో ఆపరేటివ్ కమిషనర్ – పి.ఎస్. రాహుల్ రాజ్
దేవాదాయశాఖ కమిషనర్ – ఎం.హనుమంతరావు
ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి – డి.దివ్య
మహబూబ్‌నగర్ కలెక్టర్ – బి. విజయేంద్ర
కరీంనగర్ కలెక్టర్ – చిత్ర మిశ్రా
హన్మకొండ కలెక్టర్ – చాహత్ బాజ్‌పాయ్
భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ – అంకిత్
యాదాద్రి కలెక్టర్ – అనురాగ్ జయంతి
జనగాం కలెక్టర్ – సందీప్ కుమార్ ఝా
జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ – రిజ్వాన్ బాషా షేక్
మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ – స్నేహ శబర్ష్
రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ – గరిమా అగర్వాల్
వికారాబాద్ జిల్లా కలెక్టర్ – దీపక్ తివారీ
వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ – ఉమా శంకర్ ప్రసాద్
మెదక్ జిల్లా కలెక్టర్ – ప్రతిమా సింగ్
మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ – ఫైజాన్ అహ్మద్

# సీఎంని కాదు.. పెద్దన్నను!

**మొదటి పేజీ తరువాయి**

సంబంధించి జరిగిన న్యాయపోరాటాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. కొందరు దుష్టశక్తులు ఈ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేందుకు న్యాయవ్యవస్థ ద్వారా ప్రయత్నించాయని ఆరోపించారు. వారి టాలెంట్‌ను తక్కువ చేస్తూ, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలు చేశారని విమర్శించారు. అయితే ప్రజా ప్రభుత్వం గట్టిగా నిలబడి, అదే న్యాయపోరాటంతో ఆ కుట్రలను ఛేదించిందని, అభ్యర్థుల జీవితాల్లో వెలుగులు నింపడం తనకు పూర్తి సంతృప్తినిచ్చిందని వివరించారు. ఈ విజయం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అత్యంత పేదరికం నేపథ్యం నుంచి, తల్లిదండ్రుల చెమట చుక్కల స్ఫూర్తితో ఈ యువత ఉన్నత స్థాయికి ఎదగడం అద్వితీయమైన అనుభూతినిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సొంత గడ్డకు సేవ చేసేందుకు వారు సిద్ధమవడం ఎంతో గర్వకారణమని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులపై సమా జంలో ఉన్న 'గరం, నరం, బేషరం' అనే నానుడిని ఈ యువ అధికారులు తమ పనితీరుతో తప్పు అని నిరూపించాలని ఆకాంక్షించారు.

# 'న్యాయవ్యవస్థలో అవినీతి' పుస్తకం నిషేధం

**మొదటి పేజీ తరువాయి**

పేర్కొన్నది. ఈ అంశంలో చాలా లోతైన దర్యాప్తు చేపట్టాలని భావిస్తున్నామని, దీనికి కారణమైన వారిని గుర్తించాలని, వాళు ఎవరో తాము తేల్చుతామని, నిశితంగా ఈ కేసును పరిశీలిస్తామని, ఈ కేసును మూసివేసే ప్రసక్తే లేదని సీజేఐ సూర్యకాంత్ అన్నారు. కోర్టు ధిక్కరణ కేసు కింద విద్యాశాఖతో పాటు ఎన్‌సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుప్రీం తెలిపింది. న్యాయవ్యవస్థపై వివాదాస్పద పాఠ్యాంశాన్ని రాసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవద్దో చెప్పాలని విద్యాశాఖను అడగనున్నట్లు కోర్టు పేర్కొన్నది. వివాదాస్పదమైన ఆ బుక్‌కు చెందిన హార్డ్ కాపీలు కానీ డిజిటల్ కాపీలను కానీ మార్కెట్ నుంచి తొలగించాలని కోర్టు తన ఆదేశాల్లో వెల్లడించింది. ఎన్‌సీఈఆర్టీ ప్రచురించిన క్షమాపణలను త్రిసభ్య ధర్మాసనం తిరస్కరించింది.

### ప్రధాని మోదీ అసహనం

జాతీయ విద్యాపరిశోధన–శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారట.

# వాహనాలపై రోడ్ సేఫ్టీ సెస్

**మొదటి పేజీ తరువాయి**

వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించే సమయంలో ఈ అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. మూడు చక్రాల గూడ్స్ వాహనాలపై గతంలో క్వార్టర్లీ ట్యాక్స్ ఉండేది. రవాణాశాఖ తాజాగా దాన్ని లైఫ్‌ట్యాక్స్ పరిధిలోకి తీసుకువచ్చింది. రోడ్డు భద్రత చర్యలకు అవసరమయ్యే నిధుల సమీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ అదనపు ట్యాక్స్ ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ ప్రయోజనాలకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రైలర్లకు మాత్రం పన్ను మినహాయింపు ఉంటుంది. ఈ ట్యాక్స్ పరిధిలోకి బైకులు, కార్లు, తేలికపాటి వాహనాలు వస్తాయి. ఇతర వాహనాల పరిధిలోకి 4 నుంచి 7 సీట్ల సామర్థ్యం ఉన్న ప్రయాణికుల ఆటోలు వస్తాయి. రోడ్డు భద్రత పన్ను బైకులు, స్కూటీలు వంటి ద్విచక్రవాహనాలకు రూ. 2 వేలు ఉంటుంది. కార్లు వంటి వాటికి రూ.5 వేలు వసూలు చేయనున్నారు. ఇతర వాహనాలు అంటే గూడ్స్ వెహికల్స్, ఆటోల్లో రూ.10 వరకు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఇప్పటికే పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యుడికి.. కొత్త వాహనం కొనేటప్పుడు ఈ అదనపు పన్ను ఖచ్చితంగా భారమే అవుతుంది. ఈ నిర్ణయంపై పునరాలోచించాలని వాహనదారులు కోరుతున్నారు. అయితే సర్కార్ మాత్రం పన్ను విధింపుపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంటోంది.

# నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియం

**మొదటి పేజీ తరువాయి**

ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, 24 గంటల భద్రత వంటి వసతులు ఉండనున్నాయి. విద్యార్థుల రవాణా కోసం బస్సు సౌకర్యాన్ని కల్పించనుండగా దీనికయ్యే ఖర్చులో 50 శాతం ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన మొత్తంలో 40 శాతం బ్యాంక్ లోన్లు.. 10 శాతం తల్లిదండ్రుల భాగస్వామ్యంతో సమకూరుస్తారు. పౌష్టికాహారం అందించేందుకు మండల స్థాయిలో సెంట్రల్ కిచెన్లను ఏర్పాటు చేసి నాణ్యమైన అల్పాహారం.. భోజనం అందించాలని కమిషన్ సిఫార్సు చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై లక్ష రూపాయలు ఖర్చు చేస్తుండగా.. ఈ కొత్త నమూనాలో అత్యాధునిక వసతులతో కలిపి కేవలం 50 వేల రూపాయల లోపే ఖర్చవుతుందని కమిషన్ అంచనా వేసింది. ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పుగా టీజీ ఈఏపీసెట్ (గతంలో ఎంసెట్) రద్దును కమిషన్ ప్రతిపాదించింది. ఇంజనీరింగ్.. అగ్రికల్చర్.. ఫార్మసీ ప్రవేశాలకు ఎంట్రన్స్ పరీక్షలకు బదులుగా ఇంటర్మీడియట్ మార్కులనే ప్రాతిపదికగా తీసుకోవాలని సూచించింది. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు 11వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసి కేవలం 10.. 12 తరగతులకు మాత్రమే బోర్డు పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పించడమే ఈ నివేదిక ప్రధాన ఉద్దేశం. పాఠశాల విద్య.. ఇంటర్మీడియట్ బోర్డులను విలీనం చేసి ఒకే బోర్డును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. విద్యా ప్రమాణాలను పెంచేందుకు కనీస ఉత్తీర్ణత మార్కులను 35 శాతం నుండి 45 శాతానికి పెంచాలని సూచించింది. జూనియర్ కాలేజీల పేరుతో నడుస్తున్న కోచింగ్ సెంటర్లపై కఠిన నియంత్రణ ఉండాలని.. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కమిషన్ స్పష్టం చేసింది. రాబోయే ఐదేళ్లలో 2,000 పాఠశాలల ఏర్పాటు కోసం 36 వేల కోట్ల రూపాయల రోడ్ మ్యాప్‌ను కమిషన్ ప్రభుత్వానికి వివరించింది.

### విద్యా కమిషన్ సిఫార్సులు:

1. ఉపాధ్యాయుల పదోన్నతులు: ఆటోమేటిక్ పదోన్నతులు ఉండకూడదు, పని తీరు ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలి.
2. బోధన మాధ్యమం: ఇంగ్లిష్ ఉండాలి, నర్సరీ నుంచి యూనివర్సిటీల వరకు.
3. త్రిభాషా విధానం: ఒకటో తరగతి నుంచే తెలుగు/ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ బోధించాలి.
4. విద్యార్థి కేంద్రంగా విద్యా విధానం: విద్యా విధానం పూర్తిగా విద్యార్థి కేంద్రంగా ఉండాలి.
5. ఎప్‌సెట్ రద్దు: ఇంజినీరింగ్, వ్యవసాయం, ఫార్మసీ ప్రవేశాలు 12వ తరగతి మార్కుల ఆధారంగా కేటాయించాలి.
6. డీ.ఈఐ.ఈడీ రద్దు: బీఎడ్‌ను పునర్వ్యవస్థీకరించాలి.
7. పాఠశాలల్లో వంట వండే మహిళలకు చెల్లింపులు: వారానికి ఒకసారి చెల్లింపులు చేయాలి.
8. ఐఐటీ–జేఈఈ/నీట్ కోచింగ్ సెంటర్లు: నియంత్రించేందుకు చట్ట సవరణ చేయాలి.
9. ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి వేరుగా పోటీ పరీక్షల కోచింగ్ వేరు చేయాలి.
10. విశ్వ విద్యాలయాల కార్యనిర్వాహక మండలి పునర్నిర్మాణం: వైస్ చాన్సలర్ చైర్మన్‌గా ఉండాలి.

# ఫెన్సింగ్ వేసినందుకు రూ.లక్ష జరిమానా

**మొదటి పేజీ తరువాయి**

జిల్లా అదనపు జిల్లా న్యాయమూర్తి... ఈ భూమికి సంబంధించి తమను సంపూర్ణ యజమానులుగా ప్రకటించారని పిటిషన్‌లలో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు తమ ఆధీనంలో ఉన్న భూముల్లో జోక్యం చేసుకోకుండా శాశ్వత నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ... హైడ్రా ఫెన్సింగ్ వేసిందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, ఎల్బీ నగర్ జోనల్ కార్యాలయ అధికారులకు ట్రయల్ కోర్టు ఆదేశాల గురించి తెలుసునని... అయినప్పటికీ సంబంధిత భూమికి కంచె వేయాలని హైడ్రాను ఆదేశించారని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. వాస్తవాల నిర్ధారణకు అడ్వకేట్ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. అడ్వకేట్ కమిషన్ విచారణ జరిపి తమ నివేదికను తాజాగా హైకోర్టుకు అందజేశారు. కోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్ కూడా స్థల సర్వే నిర్వహించి నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్ కుమార్ స్పందిస్తూ... హైడ్రా తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఫెన్సింగ్ వేయడం, బోర్డులను బిగించడం వంటి చర్యలు ట్రయల్ కోర్టు లేదా హైకోర్టు ఆదేశాల మేరకు జరగాలి. ఈ కేసులో హైకోర్టు ఎదుట రిట్ పిటిషన్‌లు దాఖలై విచారణలో ఉండగా హైడ్రా దూకుడుగా వ్యవహరించి ఫెన్సింగ్ వేసింది. హైడ్రా చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించలేదు. అయితే ఇప్పుము మాత్రం తనను తాను సమర్థించుకునేందుకు హైడ్రా ప్రయత్నిస్తుంది" అని జస్టిస్ శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. హైడ్రా చర్య న్యాయపరమైన ఆదేశాలను ఉల్లంఘించడమేనని పేర్కొంటూ... కంచెను తొలగించి, పిటిషనర్లకు ఖర్చులు చెల్లించాలని ఆదేశించారు. హైడ్రా తక్షణం ఫెన్సింగ్, బోర్డులను తొలగించకపోతే, వాటిని తొలగించేంతవరకు రోజుకు రూ. లక్ష చొప్పున పిటిషనర్లకు చెల్లించాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన తదుపరి విచారణను మార్చి 18కి వాయిదా వేశారు.



# యాక్షన్.. 99

**మొదటి పేజీ తరువాయి**

నిరంతరం క్షేత్రస్థాయిలోనే పర్యటించనున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరువ చేయడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనుల సందడి నెలకొనేలా చూడాలని సబ్ కమిటీ నిర్ణయించింది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వంద రోజుల లోపు స్పష్టమైన మార్పు చూపడం ద్వారా ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం యోచిస్తోంది. అధికారులకు సైతం స్పష్టమైన గడువులను నిర్దేశించి, పనుల్లో జాప్యం లేకుండా పర్యవేక్షించే బాధ్యతను ఈ నలుగురు మంత్రుల కమిటీకి అప్పగించారు.





# సాంకేతికత దిశగా సాగు

నూతన పరిశోధనలు అవసరం

వ్యవసాయ ఎగుమతులు ప్రోత్సహించాలి

విద్యార్థుల కోసం ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు

ఎన్ఐపీహెచ్ఎం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): సాంకేతికత దిశగా సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్ఐపీహెచ్ఎంలో గురువారం నుంచి మూడ్రోజుల పాటు 'స్థితిస్థాపక వ్యవసాయం, వ్యవసాయ–ఎగుమతి ప్రోత్సాహం కోసం మొక్కల ఆరోగ్య నిర్వహణలో ఆవిష్కరణలు' అంశంపై జాతీయ సదస్సు జరుగుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన ప్రారంభోత్సవంలో ఐసీఏఆర్ ఏడీజీ పీపీ డాక్టర్ పూనమ్ జస్రోటియా, డీపీపీక్యూఎస్, ప్లాంట్ ప్రొటెక్షన్ అడ్వైజర్ డాక్టర్ జేపీ సింగ్, ఇంఫాల్, సీఏయూ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్ఎన్ పూరి, పీపీఏఐ అధ్యక్షుడు డాక్టర్ శరత్ బాబు, ఈఎస్ఐ జనరల్ సెక్రటరీ డాక్టర్ సచిన్ ఎస్. సురోషే, ఐఈఎస్ అధ్యక్షుడు డాక్టర్ ఏకే ధావన్, ఐఎస్ఏఈ–తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు జీవీ రమణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాగత ప్రసంగం చేసిన హనుమాన్ సింగ్.. మొక్కల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, రైతులు, పరిశ్రమలు వంటి మొక్కల ఆరోగ్య నిర్వహణలోని అన్ని వాటాదారులను ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరాన్ని వివరించారు. మొక్కల రక్షణ, వ్యవసాయ ఎగుమతుల ప్రోత్సాహంలో సమస్యలను పరిష్కరించడంలో ఏఐని ఎలా ఉపయోగించవచ్చో వివరించారు. మొక్కల ఆరోగ్యం, వ్యవసాయ ఎగుమతుల రంగంలో ఎదురవుతున్న సవాళ్లను వివరించి, నూతన పరిశోధనల అవసరాన్ని డా.పూనమ్ జస్రోటియా ప్రముఖంగా ప్రస్తావించారు. పురుగుల గుర్తింపు, నిర్వహణలో రిమోట్ డయాగ్నస్టిక్ సాధనాల ప్రాముఖ్యతను, బయోపెస్టిసైడ్లు, పెస్టిసైడ్ల నాణ్యత నియంత్రణ అవసరాన్ని డాక్టర్ జేపీ సింగ్ వివరించారు. సహజ వ్యవసాయ ప్రాముఖ్యతను, దానిపై పరిశోధనలు నిర్వహించాల్సిన అవసరాన్ని డాక్టర్ ఎస్ఎన్ పూరి తెలియజేశారు. పీపీఏఐ, ఈఎస్ఐ, ఐఈఎస్, ఐఎస్ఏఈ సంస్థలు రైతులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరాన్ని, నకిలీ పురుగుమందుల సమస్యకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరాన్ని వ్యక్తం చేశాయి. కాగా, ఈ కార్యక్రమంలో స్టోర్ గ్రీన్ మేనేజ్‌మెంట్, సరైన పురుగుమందుల వినియోగ సాంకేతికతపై రెండు భారీ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులను ఎక్స్టెన్షన్ అధికారులు, విద్యార్థులు, విద్యాసంస్థలు, ఇతర భాగస్వాముల కోసం ప్రారంభించారు. వ్యవసాయ స్థితిస్థాపకతను బలోపేతం చేసే, ముఖ్యంగా వాతావరణ మార్పుల నేపథ్యంలో భారతదేశ వ్యవసాయ–ఎగుమతి పోటీతత్వాన్ని పెంచే మొక్కల ఆరోగ్య నిర్వహణలో ఉద్భవిస్తున్న ఆవిష్కరణలు, సాంకేతికతలు, విధాన చట్రాలపై చర్చించే లక్ష్యంతో నిర్వహించిన ఈ సమావేశంలో.. శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు, పరిశ్రమ నాయకులు, వ్యవసాయ వ్యవస్థాపకులు, ఎగుమతిదారులు, వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్లు, తెలంగాణకు చెందిన ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు. తెగులు నిర్ధారణ కోసం డిజిటల్ సాధనాలు, తెగులు నియంత్రణ కోసం ఐపీఎం చర్యలు, స్వీకరణపై రైతుల కోసం ప్రత్యేక సెషన్‌లు నిర్వహించారు. రైతుల కోసం అభివృద్ధి చేసిన వినూత్న సాంకేతికతలను ఈ వేదిక ద్వారా ప్రదర్శించారు. ఈ సదస్సు నిర్వహణకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్–హైదరాబాద్, వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ–భారత ప్రభుత్వం, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (పీపీఏఐ), ఎంటమోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఈఎస్ఐ), ఇండియన్ ఎకలాజికల్ సొసైటీ (ఐఈఎస్), ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీర్స్ (ఐఎస్ఏఈ), ఇండియన్ ఫైటోపాథలాజికల్ సొసైటీ (ఐపీఎస్) సహకారం అందించాయి.

## బాల్క సుమన్‌కు దక్కని ఊరట

బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా

మంచిర్యాల, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు న్యాయస్థానంలో ఈరోజు కాస్త నిరాశ ఎదురయింది. క్యాతనపల్లి ఘటనలో అరెస్టై జైలులో ఉన్న ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల జిల్లా కోర్టులో ఈరోజు కూడా వాదనలు జరిగాయి. అయితే, పోలీసుల తరపున దాఖలైన కస్టడీ పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉండటంతో, బెయిల్ వ్యవహారంపై తదుపరి విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది. లంచ్ మోషన్ అనంతరం కస్టడీ పిటిషన్‌పై కోర్టు నిర్ణయం తీసుకోనుంది. బాల్క సుమన్ తరపున న్యాయవాది లలిత కోర్టులో గట్టి వాదనలు వినిపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు అక్రమ కేసులు బనాయించారని ఆమె ఆరోపించారు. సుమన్ అరెస్టు ప్రక్రియలో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలను పోలీసులు పూర్తిగా గాలికి వదిలేశారని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం అధికార బలంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, కావాలనే బీఆర్ఎస్ నేతలను జైలు పాలు చేసిందని ఆమె వివరించారు. మరోవైపు, కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని విచారించాల్సిన అవసరం ఉందని, అందుకే కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. క్యాతనపల్లి ఉదంతంలో బాల్క సుమన్ పాత్రపై మరింత లోతైన విచారణ జరపాల్సి ఉందని వారు వాదించారు. ఈ క్రమంలో బెయిల్ పిటిషన్ పై విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది.

# అధిక ఫీజులు వసూలు చేస్తే..

ప్రైవేటు స్కూల్స్ అనుమతి రద్దు.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్రైవేటు పాఠశాలల అధిక ఫీజుల వసూళ్లు జరుగుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు.. ఎన్నిసార్లు ప్రభుత్వాలకు మొకరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. రకరకాల ఖర్చుల పేరుతో ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు.. విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాలు పీల్చుతున్నాయి. ఎల్‌కేజీ నుంచి మొదలుపెడితే.. ఉన్నత స్థాయి విద్య వరకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆగడాలు అన్నీ ఇన్నీ కాదు. ఈ క్రమంలోనే తెలంగాణ విద్యా శాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ రూపొందించేందుకు ఏర్పాటైన తెలంగాణ విద్యా కమిషన్ అందించిన సమగ్ర నివేదిక తర్వాత సీఎం రేవంత్ రెడ్డి.. విద్యాశాఖపై కీలక సమీక్ష నిర్వహించారు. నిబంధనలను ఉల్లంఘించి.. ప్రైవేటు పాఠశాలలు ఫీజులు వసూలు చేస్తే.. వాటి అనుమతి రద్దుతో పాటు.. అధికంగా వసూలు చేసిన ఫీజును రికవరీ చేసేలా నిబంధనలు విధించాలని సీఎం రేవంత్ రెడ్డి.. విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి సలహాలను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యా శాఖపై సంబంధిత ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ రీజియన్‌లోని ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో ఎలాంటి రాజీ పడొద్దని పేర్కొన్నారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్స్




వంటి పెద్ద పెద్ద విద్యాలయాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు.. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో ఏర్పాటు చేయాలన్నారు.మరోవైపు.. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు కచ్చితంగా పాలు అందించాలని ఆదేశించారు. వాటిని విజయ డైరీ నుంచి సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఆర్టిఫిషియల్ టెక్నాలజీ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించాలని పేర్కొన్నారు. కోర్ అర్బన్ రీజియన్ కాకుండా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా తయారవుతున్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల లాగే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్టు సహా అన్ని సౌకర్యాలను కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సులను ఏర్పాటు చేయడం పైనా అధ్యయనం చేయాలని అధికారులకు హితవు పలికారు. ఇక విద్యా శాఖపై సీఎం నిర్వహించిన ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఏయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్రంలో సమగ్ర విద్యా పాలసీ రూపకల్పన కోసం ఏర్పాటైన తెలంగాణ విద్యా కమిషన్ సీఎం రేవంత్ రెడ్డికి సమగ్ర రిపోర్ట్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 305 స్కూళ్లను సందర్శించి ఈ రిపోర్ట్‌ను తయారు చేసినట్లు కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లతో ఏకంగా 46 సమావేశాలు నిర్వహించామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ పెట్టాలని ప్రభుత్వానికి కమిషన్ సిఫార్సు చేసినట్లు వివరించారు.

## కేటీఆర్, హరీశ్‌వి అబద్ధాలు

కాళేశ్వరం వైఫల్యాలపై మంత్రి పొంగులేటి

లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. ప్రాజెక్టులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి లక్ష్యమని ఆయన ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 1.08 లక్షల కోట్ల అంచనాతో నిర్మించి, కేవలం 110 టీఎంసీల నీటిని మాత్రమే అందుబాటులోకి తీసుకురావడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని పొంగులేటి మండిపడ్డారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయాయని అన్నారు. ఆ తప్పిదాల నుంచి తప్పుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఉందన్న విషయం బహిరంగ రహస్యమేనని, అందుకే వారు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం దురదృష్టకరమని పొంగులేటి అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది రైతులకు మేలు చేకూర్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.

## పేదోళ్ల ఇళ్లను కూల్చి.. వేల కోట్లతో పార్కులా?

రేవంత్ సర్కార్‌పై ఈటల ధ్వజం

రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ ప్రభుత్వం బడుగు జీవుల ఉసురు పోసుకుంటోందని ఆయన మండిపడ్డారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన, మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని, మధుపార్క్ వంటి అపార్ట్‌మెంట్లలో నివసించే వారి ఆవేదన ప్రభుత్వానికి వినిపించడం లేదా అని నిలదీశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, పేదలకు కొత్తగా ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, ఉన్న నీడను లాక్కోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలు, విద్యార్థుల డైట్ ఛార్జీలకు నిధులు లేవని చెబుతున్న సర్కారు... వేల కోట్లు వెచ్చించి గాంధీ పార్కు నిర్మించాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. "బడా బాబులు వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే చూస్తూ ఊరుకుంటున్న పాలకులు, సామాన్యుడిపై మాత్రం జులుం ప్రదర్శిస్తున్నారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ వద్ద 120 ఎకరాల భూమి అన్యాక్రాంతమైనా పట్టించుకునే నాథుడే లేడు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ గాంధీ పార్కు కట్టాలనుకుంటే, కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన భూముల్లో నిర్మించుకోవాలి కానీ, పేదల ఇళ్లను పడగొట్టి కాదని అన్నారు. తెలంగాణలో జరుగుతున్న ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని, ఇక్కడి 'దుర్మార్గాలను' తక్షణమే అరికట్టాలని ఈటల డిమాండ్ చేశారు. పేదల పొట్టకొట్టి చేస్తున్న ఈ అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి తక్షణమే ప్రత్యామ్నాయం చూపాలని, లేనిపక్షంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఇరాన్‌పై అమెరికా దాడి చేస్తుంది: ఒవైసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై స్వదేశంలో రాజకీయ వేడి రాజుకుంది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రధాని పర్యటన తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ పర్యటన ముగిసిన వెంటనే అంతర్జాతీయంగా పెను మార్పులు సంభవించే అవకాశం ఉందంటూ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీ పర్యటన ముగిసిన వెంటనే ఇరాన్ పై అమెరికా దాడి చేసే అవకాశం ఉందని అన్నారు. ముఖ్యంగా గాజాలో జరుగుతున్న మారణహోమానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రధాన కారకుడని... అటువంటి వ్యక్తిని ప్రధాని మోదీ కౌగిలించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ పర్యటన భారతదేశానికి పాలస్తీనా పట్ల ఉన్న దశాబ్దాల మద్దతును దెబ్బతీసేలా ఉందని ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో భారత్ అనుసరించిన తటస్థ మద్దతు వైఖరిని ప్రధాని పక్కన పెడుతున్నారని ఆయన విమర్శించారు.

# వెలుగుమెట్ల బాధితులను ఆదుకుంటాం

ఇంటి స్థలం, ఇళ్లు ఇస్తాం


కావాలనే కేసీఆర్ అండ్ కో విషప్రచారం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని, దీనికి మరోవైపు బిజేపీ నేతలు వంతపాడుతున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. గురువారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్, రామ సహాయం రఘుమారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, మాధవరెడ్డితో కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొట్టించిందని చెబుతూ నాడు కూల్చివేత సంఘటనల ఫోటోలను ప్రదర్శించారు. అంతేగాక వెలుగుమెట్లలో పేదలకు ఇండ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసింది. కానీ ఇందిరమ్మ ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ అక్రమంగా ఉన్న ఇండ్లను తొలగించడం జరిగింది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

### పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్

'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు అక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇళ్లు ఇస్తాం. పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'ఈవిషయంలో నిజంగా



పేదలపై బిఆర్ఎస్ బావ మరుదులు, ఫాంహౌస్‌లో ఉండి కుట్రలు చేస్తున్న కేసీఆర్ వెంటనే స్పందించి కాళేశ్వరంలో దోచుకున్న...దాచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌ను కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను చేపట్టి ఎనిమిదవ వింతగా ప్రచారం చేసుకుంది అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే లక్షలాది కోట్ల ప్రాజెక్ట్ కట్టడం, అవినీతి కారణంగా బీటలువారడం కూడా జరిగింది. నాలుగేళ్లలో 168 టిఎంసీ నీరు ఇస్తామని చెప్పి దీనిలో 50 టిఎంసీల నీటిని సముద్రం పాలుచేశారు'అని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### బీఆర్ఎస్‌తో చేతులు కలిపిన బీజేపీ

'కాళేశ్వరం ప్రాజెక్ట్ బీఆర్ఎస్‌కు ఏటీఎం గా మారిందన్న బీజేపీ నేతలు బీఆర్ఎస్‌తో చేతులు కలిపారు. జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదిక ఇచ్చినా...అసెంబ్లీలో తీర్మానం చేసి సీబీఐకి ఇచ్చినా ఇంతవరకు కేంద్రం కనీసం స్పందించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో వదిలేసిన ప్రాజెక్ట్ లను మేం పూర్తి చేస్తున్నాం'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పుకొచ్చారు. '16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీకి కేసీఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలి. వారు గతంలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మేం ఖచ్చితంగా అవకాశం ఇస్తాం. వచ్చి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలి'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్ట్‌ల విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసింది అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. 196 టిఎంసీల నీరు ఇస్తామని చెప్పి 168 టీఎంసీలకు పరిమితం చేసింది అని విమర్శించారు. 50 టీఎంసీలు సముద్రంలో కలిపింది అని మండిపడ్డారు. 'రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. మా ప్రభుత్వం వచ్చాక శ్వేత పత్రం ఇచ్చాం. కాళేశ్వరంపై చర్చించాం. కేంద్రం చర్యలు కోరాం. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 48వేల కోట్లు మిత్తీగా కట్టింది. కేంద్రప్రభుత్వం ఇకనైనా నిధులు ఇవ్వాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

### కాసుల కోసమే నీటి ప్రాజెక్టులు చేపట్టిన బీఆర్ఎస్: వివేక్

బీఆర్ఎస్ పార్టీ అవినీతికి పాల్పడినందును దేశంలోని ప్రాంతీయ పార్టీల్లోకెల్లా ధనిక పార్టీగా మారింది అని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధ్వజమెత్తారు. సుమారు వెయ్యి కోట్ల రూపాయిల ఫిక్స్‌డ్ డిపాజిట్లు , ఎలక్టోరల్ బాండ్లు దీనికి నిదర్శనం అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కారణంగా ఏర్పడిన నష్టాన్ని కేసీఆర్ నుంచి వసూలు చేయాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్టర్లు, కాసుల కోసమే బిఆర్ఎస్ అనుకూల నీటిప్రాజెక్టులను చేపట్టింది అని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధ్వజమెత్తారు.

## బీఆర్ఎస్ వచ్చాక అదే స్థలంలో ఇళ్లు కట్టిస్తాం: కేటీఆర్

వెలుగుమట్ల బాధితులకు పరామర్శ

ఖమ్మం, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూ బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ... శత్రుదేశంపై దండయాత్రకు వెళ్లినట్లు 4000 మంది పోలీసుల పహారాలో పేదల ఇళ్లను కూల్చివేయడం ఇందిరమ్మ రాజ్యమా? అని నిలదీశారు. బాధితులకు అండగా ఉంటామని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తనదని ఆయన భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులే ఈ అక్రమాలకు సూత్రధారులని కేటీఆర్ ఆరోపించారు. సుమారు 60 ఎకరాల విలువైన భూదాన్ భూములపై మంత్రుల కన్ను పడిందని, వారి అక్రమ సంపాదన కోసమే పేదలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎలాంటి తప్పు చేయకపోతే ముగ్గురు మంత్రులు నేరుగా ఇక్కడికి వచ్చి బాధితులకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఏ తప్పు జరగనప్పుడు ఆర్డీవోను ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించిన ఆయన, ఒక అధికారిని బలిపశువు చేసి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందని విమర్శించారు.

## సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్

**రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు**

విజయవాడ, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయ, పోలీస్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించిన రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు సరికొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌కు సంబంధించి గుంటూరు న్యాయస్థానం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా విచారణకు గైర్హాజరవుతున్న సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం బీహార్‌లో ఐజీగా విధులు నిర్వర్తిస్తున్న నాయక్‌ను తీసుకొచ్చేందుకు ఏపీ పోలీసులు ఇప్పటికే పాట్నాలో పాగా వేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ రఘురామను అరెస్ట్ చేసిన సమయంలో, కస్టడీలో ఆయనపై అమానుషంగా భౌతిక దాడి జరిగిందన్న ఆరోపణలపై నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా పోలీసులు నిన్న కోర్టులో వారెంట్ పిటిషన్ దాఖలు చేయగా, నిందితుడి సహాయ నిరాకరణను పరిగణనలోకి తీసుకున్న కోర్టు తక్షణమే అరెస్ట్ వారెంట్‌కు పచ్చజెండా ఊపింది. అయితే, బీహార్‌లో సునీల్ నాయక్‌పై అరెస్ట్ ప్రక్రియ ఉత్కంఠకు దారితీస్తోంది. ఇప్పటికే ఏపీ పోలీసు బృందం పాట్నాలో ఆయనను అదుపులోకి తీసుకుని, ఏపీకి తీసుకొచ్చేందుకు అక్కడి కోర్టులో ట్రాన్సిట్ పిటిషన్ వేయగా... ఆ పిటిషన్ ను కోర్టు తిరస్కరించింది. అంతేకాదు, నెల రోజుల పాటు ఆయనపై ఎలాంటి చర్యలు కూడా తీసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ఎవరికీ అందుబాటులో లేకుండా ఉన్నట్టు సమాచారం. తాజాగా గుంటూరు కోర్టు సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన నేపథ్యంలో, ఏపీ పోలీసులు మరింత పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ఆ ఐపీఎస్ అధికారిని పట్టుకునేందుకు బీహార్ పోలీస్ యంత్రాంగం సహకారం కోరుతూ, వీలైనంత త్వరగా ఆయనను గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం... బైకర్ మృతి

తిరుమల, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): తిరుమల పుణ్యక్షేత్రంలో విషాదం చోటుచేసుకుంది. శ్రీవారి దర్శనం ముగించుకుని తిరిగి వెళుతున్న ఇద్దరు భక్తులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని అరక్కోణం తాలుకా మిట్టపిట్టై గ్రామానికి చెందిన నటరాజన్, మునిరత్నం బైక్‌పై తిరుమల వచ్చారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్ రోడ్డులోని అత్యంత ప్రమాదకరమైన 30వ మలుపు వద్దకు రాగానే, అతివేగం కారణంగా వారి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పిట్టగోడను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర రక్తస్రావంతో నటరాజన్ ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే పోలీసులకు, టీటీడీ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు, తీవ్ర గాయాలతో పడి ఉన్న మునిరత్నంను అంబులెన్స్‌లో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, తిరుమల ఘాట్ రోడ్లు ప్రమాదకరమైన మలుపులతో ఉంటాయని, వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు పదేపదే హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే.

## దక్షిణాదిపై జనసేన గురి

**ఐదు రాష్ట్రాల్లో సభ్యత్వ సమరభేరి**

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): రాజకీయాల్లో సరికొత్త మార్పు కోసం జనసేనాని పవన్ కల్యాణ్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమంతమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు నేడు జనసేన శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు పిఠాపురం నియోజకవర్గానికే పరిమితమైన ఈ కార్యక్రమం, నేటి నుంచి విస్తృత రూపం దాల్చనుంది. కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్రలోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి భారీ స్థాయిలో సభ్యులను చేర్చుకోవడం ద్వారా కేడర్ బలాన్ని ప్రదర్శించాలని అధినేత పవన్ కల్యాణ్ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈసారి క్రియాశీలక సభ్యత్వ రుసుమును రూ. 500 నుండి రూ. 400కు తగ్గించి సామాన్యులకు మరింత చేరువయ్యే ప్రయత్నాన్ని జనసేన చేస్తోంది. కేవలం సభ్యత్వాలు తీసుకోవడమే కాకుండా, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ భారీ ఇన్సూరెన్స్ ప్యాకేజీని ప్రకటించింది. సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల రూపాయల ప్రమాద బీమాతో పాటు, ప్రమాదవశాత్తు శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ. 2 లక్షల రూపాయలు, గాయపడితే రూ. 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. వసూలైన సభ్యత్వ రుసుమును పూర్తిగా పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసమే వినియోగించడం ద్వారా కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తోంది. పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణను పెంచేందుకు సభ్యత్వాన్ని ఈసారి మూడు విభిన్న వర్గాలుగా విభజించారు. ఉద్యమి, సాధక్, ప్రదాత అనే పేర్లతో కార్యకర్తల పనితీరు, నిబద్ధత ఆధారంగా ఈ వర్గీకరణ సాగనుంది. ఇప్పటికే గత రెండు విడతల్లో విజయవంతంగా 13 లక్షల మందికి పైగా సభ్యులను నమోదు చేసుకున్న జనసేన, ఈ మూడో విడత ద్వారా రికార్డు స్థాయి సంఖ్యను చేరుకోవాలని భావిస్తోంది. సిద్ధాంతాల ప్రచారం, గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతమే ధ్యేయంగా సాగుతున్న ఈ సభ్యత్వ డ్రైవ్‌ను పవన్ కల్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## ఆదాయం పంచుకోవాల్సిందే!

**సోషల్ మీడియాకు కేంద్రం ఆదేశాలు**


న్యూఢిల్లీ: సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తమ ఆదాయాన్ని కంటెంట్ సృష్టించేవారితో న్యాయబద్ధంగా పంచుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. జర్నలిస్టులు, సంప్రదాయ మీడియా సంస్థలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, విద్యావేత్తలు, పరిశోధకులు ఇలా ఎవరైనా సరే, కంటెంట్ సృష్టిస్తే వారికి ఆదాయంలో సరైన వాటా దక్కాల్సిందేనని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్లాట్‌ఫామ్‌లు ఇతరులు అప్‌లోడ్ చేసే కంటెంట్ ద్వారా గణనీయంగా ప్రయోజనం పొందుతున్నాయని, అందుకే కంటెంట్ సృష్టికర్తలకు కూడా వారి సరైన వాటా దక్కాలని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని కంటెంట్ క్రియేటర్ల నుంచి మొదలుకొని, తమ పరిశోధనలను పంచుకునే ప్రొఫెసర్ల వరకు అందరికీ ఈ న్యాయం జరగాలన్నారు. ఆదాయ పంపిణీలో న్యాయబద్ధతను తీసుకురావడం ద్వారా దేశంలో డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తున్న తరుణంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే.. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గతేడాది ఐటీ రూల్స్-2021కి కీలక సవరణలు ప్రతిపాదించింది. పెరిగిపోతున్న డీప్‌ఫేక్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించిన తప్పుడు సమాచారాన్ని అరికట్టడమే ఈ సవరణల లక్ష్యం. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్ వంటి పెద్ద సోషల్ మీడియా సంస్థలు (50 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నవి) ఏఐ ఆధారిత కంటెంట్‌ను స్పష్టంగా లేబుల్ చేయాలి. వీడియోలు లేదా చిత్రాలైతే కనీసం 10 శాతం డిస్‌ప్లేను, ఆడియో అయితే మొదటి 10 శాతం వ్యవధిని ఈ లేబుల్ కవర్ చేయాలి. ఈ కంటెంట్‌కు శాశ్వత మెటాడేటా లేదా ఐడెంటిఫైయర్ జోడించాలని, దానిని మార్చడానికి లేదా తొలగించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ ఏదైనా ప్లాట్‌ఫామ్ ఉద్దేశపూర్వకంగా లేబుల్ లేని ఏఐ కంటెంట్‌ను అనుమతిస్తే, అది ఐటీ చట్టం ప్రకారం 'తగిన శ్రద్ధ' పాటించడంలో విఫలమైనట్లు పరిగణించబడుతుంది.



# నల్లమల సాగర్‌తో ఇబ్బందేం?

**ఆ ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం లేదు.. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు**

అమరావతి, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, దీనిపై పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి వరద జలాలను మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా తరలిస్తామని ఆయన శాసనసభలో వివరించారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడు తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం నాడు శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాష్ట్రంలో నీటి భద్రతకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు, పెట్టుబడులకు నీరే కీలకమని అన్నారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ప్రస్తుతం 793 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందుకే ఈసారి పంటల సీజన్‌ను ముందుకు జరిపి, వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళిక రచించామని ప్రకటించారు. ఈ విషయంపై రైతులను చైతన్యవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తన లక్ష్యమని, దీనికోసం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై త్వరలోనే ఒక బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనివేనని చంద్రబాబు స్పష్టం చేశారు. 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు వచ్చాయని, తాము పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలు రాయలసీమకు తరలించామని వివరించారు. అందుకే ఆ ప్రాంతం నేడు రతనాల సీమగా మారుతోందన్నారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన



ఆ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి మరో రూ.2500 కోట్లు అవసరమని, ఇప్పటికే ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.456 కోట్లతో శంకుస్థాపన చేశామని తెలిపారు. అదేవిధంగా కుప్పం కాలువలో ట్యాంకర్లతో నీళ్లు పోసి ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి డయాఫ్రాం వాల్‌ను గోదావరిలో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టును మళ్లీ పరుగులు పెట్టించి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాలు 793 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయని సీఎం తెలిపారు. జల సంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు సగటున 6 మీటర్లు పెరిగాయని, దీనివల్ల రూ.91 కోట్ల విద్యుత్ ఆదా అయిందని వివరించారు. తాను చేయని తప్పుకు 53 రోజులు జైల్లో పెట్టారని, అయినా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరివ్వాలన్న సంకల్పంతో పనిచేస్తున్నానని అన్నారు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, కొందరు కేవలం రాజకీయం కోసమే నీటి సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు, పరిశ్రమలకు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళతామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఘటన జరిగాక స్పందిస్తే ప్రయోజనమేంటి?

**అధికారులకు ఏపీ సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**

శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): శ్రీకాకుళం పట్టణంలో కలుషిత తాగునీటి కారణంగా డయేరియా ప్రబలడం, రాజమండ్రిలో కల్తీ పాల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటి తీవ్రమైన ఘటనలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మున్సిపల్, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ రెండు విషాద ఘటనల్లో ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం ఉపేక్షించవద్దని అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలి. శ్రీకాకుళంలో తాగునీరు కలుషితమైన ఘటనలో ముందస్తు తనిఖీలు జరిగి ఉంటే ఈ సమస్య వచ్చేదే కాదు" అని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ప్రతి ప్రభుత్వ విభాగంలో కింది స్థాయి యంత్రాంగాన్ని క్రియాశీలం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రతి అధికారి విధిగా పర్యటించాలన్నారు. ఒక్కో సందర్భంలో ఒక్కో శాఖపై ఆకస్మిక తనిఖీకి వెళ్లడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, కిందిస్థాయి అధికారులతో పాటు సంబంధిత శాఖల్లో జవాబుదారీతనం పెరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. కలెక్టర్లు అంటే నిత్యం ప్రజల్లోనే ఉండాలని, అప్పుడే రాష్ట్ర స్థాయిలో



అనుకున్న మార్పును తీసుకురాగలమని ఆయన పేర్కొన్నారు.

**శ్రీకాకుళంలో 107 మందికి చికిత్స: కలెక్టర్**

సమీక్షలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత పరిస్థితులను సీఎంకు వివరించారు. "జిల్లాలో ఇప్పటి వరకు 129 డయేరియా కేసులు నమోదు కాగా, ప్రస్తుతం 107 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 20 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పైపుల ద్వారా నీటి సరఫరాను నిలిపివేసి, ట్యాంకర్ల ద్వారా సురక్షితమైన నీటిని అందిస్తున్నాం. నాలుగు ఇంజనీరింగ్ బృందాలు 40 లీకులను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. 150 మంది సిబ్బంది, 7 జేసీబీలు, 10 ట్రాక్టర్లతో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. విశాఖ నుంచి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను తరలిస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలూ పనిచేసేలా మెడికల్ క్యాంపులు, ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం" అని తెలిపారు. స్థానికులు వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోకపోవడం, పైప్‌లైన్లు డ్రైనలను క్రాస్ అవ్వడం, నీటి ప్రెజర్ లేకపోవడంతో మోటార్లు పెట్టి నీటిని తోడటం వల్ల కలుషిత నీరు ఇళ్లకు చేరిందని ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు వివరించారు.

**రాజమండ్రి ఘటనలో 8 మంది పరిస్థితి విషమం**

అనంతరం రాజమండ్రి కల్తీ పాల ఘటనపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సీఎంకు వివరాలు అందించారు. "ఈ నెల 22న వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో 20 మంది అనారోగ్యం పాలుకాగా, ఐదుగురు మృతి చెందారు. మరో 15 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారిలో 8 మంది పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ప్రభావిత ప్రాంతాల్లో 9 వైద్య బృందాలు పనిచేస్తున్నాయి. 957 మందిని నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాం. నిందితుడైన పాల సరఫరాదారు గణేశ్వరరావును అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులను, పరికరాలను తెప్పించి మెరుగైన చికిత్స అందిస్తున్నాం" అని కలెక్టర్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారని అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం, రాజమండ్రి ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల ఎస్పీలు కూడా పాల్గొన్నారు.

## లొంగిపోయిన ముప్పిడి అవినాశ్ రెడ్డి

విజయవాడ, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏడో నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డి గురువారం విజయవాడలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట లొంగిపోయారు. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించి, ఈ నెల 26లోగా లొంగిపోవాలని ఆదేశించిన రెండు రోజులకే ఆయన సిట్ విచారణకు హాజరయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, అవినాశ్ రెడ్డి కచ్చితంగా లొంగిపోయి దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలన్న ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, ట్రయల్ కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు స్వేచ్ఛనిచ్చింది. అంతకుముందు ఏపీ హైకోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడంతో అవినాశ్ రెడ్డి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-24) ఎక్సైజ్ పాలసీని మార్చి, డిస్టిలరీల నుంచి ముడుపులు స్వీకరించడం ద్వారా సుమారు రూ.3,500 కోట్ల కుంభకోణం జరిగిందని ప్రధాన ఆరోపణ. మద్యం సరఫరాదారుల నుంచి కమీషన్ల రూపంలో వసూలు చేసిన డబ్బును అవినాశ్ రెడ్డి విదేశాలకు తరలించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని అభియోగాలు నమోదయ్యాయి. ఆయన దేశం విడిచి పారిపోయాడని, ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఇందుకు సహకరించాడని ప్రాసిక్యూషన్ గతంలో కోర్టుకు తెలిపింది. 2024లో టీడీపీ-ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కుంభకోణంపై కేసు నమోదైంది. తొలుత ఎక్సైజ్ శాఖ అధికారి ఫిర్యాదుతో సీఐడీ దర్యాప్తు ప్రారంభించగా, తర్వాత ప్రభుత్వం కేసును లోతుగా విచారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వైసీపీ నేతలు తమకు అనుకూలమైన నూతన మద్యం పాలసీని ప్రోత్సహించి, కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి, డిస్టిలరీ కంపెనీల నుంచి ముడుపులు స్వీకరించారని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించారని సిట్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ కేసులో పలువురు ఎంపీలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, డిస్టిలరీ కంపెనీల యజమానులను కూడా సిట్ నిందితులుగా చేర్చింది. అవినాశ్ రెడ్డి

# జగన్ వల్లే సీమ లిఫ్ట్ ఆగింది

**టీడీపీ మంత్రుల ధ్వజం**

అమరావతి, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): శాసనమండలిలో రాయలసీమ ఎత్తిపోతల పథకం (రాయలసీమ లిఫ్ట్) అంశంపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుపై ఇప్పుడు తమను ప్రశ్నించడం ఏంటని కూటమి ప్రభుత్వ మంత్రులు వైసీపీ సభ్యులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాలుగేళ్ల పాటు ఆగిపోయిన పనులకు సమాధానం చెప్పకుండా, ఇప్పుడు ప్రభుత్వంపై బురద చల్లడమేంటని నిలదీశారు. ఈ సందర్భంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు. "రాయలసీమ లిఫ్ట్ పనులు 2020లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలతో ఆగిపోయాయి. ఈ విషయాన్ని నాటి తెలంగాణ మంత్రి హరీశ్ రావు స్వయంగా ప్రకటించారు. అలాంటప్పుడు, నాలుగేళ్లుగా అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఏం చేసింది?



కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది మీ అసమర్థత కాదా?" అని పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి, ప్రాజెక్టులు కొట్టుకుపోవడానికి కారణమైన జగన్ రెడ్డి ఓ రాయలసీమ ద్రోహి అని వారు అభివర్ణించారు. తమ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. "రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో వైసీపీ ప్రభుత్వం సీమకు 1 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదు. కానీ, మేం హంద్రీనీవా పనులు పూర్తి చేసి 190 రోజుల్లోనే 44 టీఎంసీల నీటిని తరలించాం. ప్రస్తుతం రాయలసీమ ప్రాజెక్టుల్లో 366 టీఎంసీల నీటిని నిల్వ చేశాం. ఇది మా నాయకుడు చంద్రబాబు సమర్థతకు నిదర్శనం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 20 నెలల్లోనే రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని, తాజా బడ్జెట్‌లో మరో రూ.10,014 కోట్లు కేటాయించిందని వివరించారు. వైసీపీ ప్రభుత్వం జీఓ 365 తెచ్చి 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసిందని, గోరుకల్లు, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని మంత్రులు ఆరోపించారు. "మీ దరిద్రపు పాలనలో, మీ అసమర్థ నాయకుడి చేతకానితనం వల్లే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోయింది. ఆ నిజాన్ని కప్పిపుచ్చి ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తుంటే, వైసీపీ నేతలు రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు" అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ హయాంలో నిలిచిపోయిన పనులకు మమ్మల్ని బాధ్యులను చేసే ప్రయత్నాన్ని మానుకోవాలని వారు హితవు పలికారు.

# వారంలో శశికళ కొత్త పార్టీ పేరు

**తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం**

చెన్నై: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వి.కె. శశికళ తన రాజకీయ పునరాగమనాన్ని ఖాయం చేస్తూ కీలక ప్రకటన చేశారు. వారం రోజుల్లో తన కొత్త రాజకీయ పార్టీ పేరును వెల్లడిస్తానని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో తమిళనాడు రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన ఆమె, పార్టీ ప్రారంభానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. "వారం రోజుల్లో పార్టీ పేరు ప్రకటిస్తాం. పొత్తుల కోసం కూడా చర్చలు జరుపుతున్నాం. ఈ చర్చలు కచ్చితంగా ఒక మంచి నిర్ణయానికి దారితీస్తాయి" అని శశికళ పేర్కొన్నారు. అయితే, ఏ పార్టీలతో చర్చలు జరుపుతున్నారనే వివరాలను వెల్లడించడానికి ఆమె నిరాకరించారు. ఈ వ్యాఖ్యలతో తమిళనాట రాజకీయ ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో కొత్త పార్టీ నిర్మాణం సవాలుగా మారదా? అని విలేకరులు ప్రశ్నించగా శశికళ ధీమా వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రస్థానం, ప్రజా జీవితం గురించి తమిళనాడు ప్రజలకు బాగా తెలుసని, కాబట్టి పార్టీకి ప్రజల మద్దతు కూడగట్టడం పెద్ద కష్టమేమీ కాదని ఆమె అభిప్రాయపడ్డారు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శశికళ ప్రకటనను రాజకీయ విశ్లేషకులు ఒక ముఖ్యమైన పరిణామంగా చూస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసిన తరుణంలో శశికళ రాకతో కొత్త రాజకీయ సమీకరణాలు, పొత్తుల వ్యూహాలు తెరపైకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సందర్భంగా నిన్న కన్నుమూసిన సీపీఐ సీనియర్ నేత ఆర్. నల్లకన్నుకు శశికళ నివాళులర్పించారు. ఆయన పేదల సంక్షేమానికే తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడని ఆమె కొనియాడారు. ఎంపీగా గానీ, ఎమ్మెల్యేగా గానీ ఏ పదవి చేపట్టకపోయినా, తన సిద్ధాంతాలకు కట్టుబడి చివరి వరకు నిలిచారని గుర్తు చేసుకున్నారు. "ఆయన అందరితో ఆప్యాయంగా ఉండేవారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు, ఆయన ఉద్యమానికి తీరని లోటు" అని శశికళ విచారం వ్యక్తం చేశారు. తాజా ప్రకటనతో రాబోయే నెలల్లో తమిళనాట రాజకీయ కార్యకలాపాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయని స్పష్టమవుతోంది.



## బ్రిటన్ ఎంపీ అరెస్టుకు బంగ్లా చర్యలు

**ఇంటర్ పోల్ సాయం కోరనున్న బంగ్లాదేశ్**

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మేనకోడలు, బ్రిటన్ ఎంపీ టులిప్ రిజ్వానా సిద్దిఖ్‌ను అరెస్ట్ చేసేందుకు ఇంటర్‌పోల్ 'రెడ్ నోటీసు' జారీ చేయాలని ఢాకా కోర్టు అధికారులను ఆదేశించింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్ అవినీతి నిరోధక కమిషన్ (ఏసీసీ) దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన ఢాకా మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జి సబ్బీర్ ఫైజ్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానిగా తన అత్త షేక్ హసీనా పలుకుబడిని ఉపయోగించుకుని, ఢాకాలోని గుల్షన్‌లో ఉన్న ఓ ఫ్లాట్‌ను ఎలాంటి చెల్లింపులు చేయకుండా అక్రమంగా సొంతం చేసుకున్నారని టులిప్‌పై ఏసీసీ ఆరోపించింది. ఆమె ప్రస్తుతం విదేశాల్లో (యూకే) ఉన్నందున, అరెస్ట్ చేసేందుకు ఇంటర్‌పోల్ సహాయం అవసరమని కోర్టుకు విన్నవించింది. ఈ నేపథ్యంలోనే కోర్టు రెడ్ నోటీసుకు ఆదేశాలు ఇచ్చింది. బంగ్లాదేశ్‌లో కొత్తగా అధికారంలోకి వచ్చిన బీఎన్‌పీ ప్రభుత్వం, అవామీ లీగ్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే విమర్శలకు ఈ పరిణామం బలం చేకూరుస్తోంది. ఇటీవలే పూర్బాచల్ ప్లాట్ల కుంభకోణం కేసులో హసీనాకు పదేళ్లు, టులిప్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే. అయితే, తమపై వస్తున్న అవినీతి ఆరోపణలను హసీనా, ఆమె కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమైన, నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. ఎన్నిక కాని ప్రభుత్వం నియంత్రణలో ఉన్న ఏసీసీ, పక్షపాత సాక్ష్యాలతో తమపై కేసులు బనాయించిందని, కనీసం ఆత్మరక్షణ చేసుకునే అవకాశం కూడా ఇవ్వలేదని వారు విమర్శించారు.

## భారత్‌కు రుణపడి ఉంటా

**ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు**



జెరూసలెం : భారత్‌కు తాను వ్యక్తిగతంగా ఎంతో రుణపడి ఉన్నానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి జెరూసలంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ఒక మధుర జ్ఞాపకాన్ని పంచుకున్నారు. తన భార్య సారాతో మొదటి డేటింగ్ టెల్ అవీవ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని ఆయన గుర్తుచేసుకున్నారు. "ఈ విషయం నేను మీకు చెప్పానో లేదో నాకు తెలియదు నరేంద్ర... కానీ, నేను భారత్‌కు ఒక వ్యక్తిగత రుణం తీర్చుకోవాలి. నేను సారాను మొదటిసారి కలిసినప్పుడు, మా మొదటి లేదా రెండో డేటింగ్ ఒక ఇండియన్ రెస్టారెంట్‌లో జరిగింది. అక్కడి ఆహారం నమ్మశక్యం కాని రీతిలో అద్భుతంగా ఉంది. ఆ రోజే సారా మొదటిసారి భారతీయ వంటకాలను రుచి చూసింది. అది గొప్ప డేటింగ్. అందుకే నేను, నా పిల్లలు భారత్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం" అని నెతన్యాహు ఉద్వేగంగా చెప్పారు. ఇరు దేశాల మధ్య స్నేహబంధం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్నారు. బుధవారం టెల్ అవీవ్‌లో నెతన్యాహు, ఆయన భార్య సారా.. మోదీకి ఘనస్వాగతం పలికారు. అనంతరం జెరూసలంలోని నెసెట్‌లో మోదీ ప్రసంగించారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన చరిత్ర సృష్టించారు.

## 48 గంటల్లోగా ఫ్రీగా రద్దు

**విమాన ప్రయాణికులకు గుడ్ న్యూస్.. టికెట్ రద్దుపై డీజీసీఏ కొత్త రూల్స్**

న్యూఢిల్లీ: విమాన ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) శుభవార్త చెప్పింది. టికెట్ రద్దు, రిఫండ్‌లకు సంబంధించి సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ (సీఏఆర్)ను సవరిస్తూ కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. దీని ప్రకారం, ప్రయాణికులు టికెట్ బుక్ చేసిన 48 గంటల లోపు ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే టికెట్‌ను రద్దు చేసుకోవచ్చు లేదా మార్పులు చేసుకోవచ్చు. ఈ కొత్త నిబంధనలు మార్చి 26 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, ఈ 'లుక్-ఇన్' పీరియడ్ సదుపాయానికి కొన్ని షరతులు వర్తిస్తాయి. దేశీయ విమాన ప్రయాణానికి కనీసం 7 రోజుల ముందు, అంతర్జాతీయ ప్రయాణానికి 15 రోజుల ముందు బుక్ చేసుకున్న టికెట్లకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. కేవలం ఎయిర్‌లైన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్లు బుక్ చేసుకున్న వారికే ఈ ప్రయోజనం అందుబాటులో ఉంటుంది. ఒకవేళ వేరే విమానానికి టికెట్ మార్చుకుంటే, ఛార్జీల వ్యత్యాసాన్ని ప్రయాణికులు చెల్లించాల్సి ఉంటుంది. 48 గంటలు దాటిన తర్వాత సాధారణ రద్దు ఛార్జీలు వర్తిస్తాయని డీజీసీఏ స్పష్టం చేసింది. టికెట్లపై పేరు తప్పుగా పడితే, బుక్ చేసిన 24 గంటల్లోపు తెలియజేస్తే ఎలాంటి రుసుము లేకుండా సరిచేసుకోవచ్చని తెలిపింది. ఇక రిఫండ్ల విషయంలోనూ డీజీసీఏ స్పష్టత ఇచ్చింది. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకున్న టికెట్ల రిఫండ్ బాధ్యత కూడా విమానయాన సంస్థలదేనని, 14 రోజుల్లోగా ఆ మొత్తాన్ని వాపసు ఇవ్వాలని ఆదేశించింది. క్రెడిట్ కార్డ్ చెల్లింపుల రిఫండ్‌ను 7 రోజుల్లో, ఆఫీసులో నగదు చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలని పేర్కొంది. బేస్ ఫేర్ నాన్-రిఫండబుల్ అయినప్పటికీ, పన్నులు, ఇతర ఛార్జీలను తప్పనిసరిగా వాపసు ఇవ్వాలని స్పష్టం చేసింది.

## లొంగిపోతానంటే హత్య చేశారు!

**మావోయిస్టు కమాండర్ దారుణ హత్య**



భువనేశ్వర్: ఒడిశా అడవుల్లో మావోయిస్టుల మధ్య చెలరేగిన అంతర్గత విభేదాలు ఒక కీలక నేత ప్రాణాలను బలిగొన్నాయి. తుపాకీ పట్టి విప్లవం బాటలో నడిచిన ఒక మావో కీలక నేత జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమవడమే ఆయన మరణానికి శాపమైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టు నాయకుడు అన్వేష్ అలియాస్ రేణు, తన అనుచరులతో కలిసి పోలీసుల ముందు లొంగిపోయేందుకు సిద్ధమవగా, ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించిన మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత సుక్రు అతడిని అత్యంత దారుణంగా హతమార్చాడు. జనవరి 29న జరిగిన ఈ అడవి రక్తపాతం, పకారి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అన్వేష్ కుళ్లిపోయిన మృతదేహం లభ్యమవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... అన్వేష్ తలపై రూ. 22 లక్షల భారీ రివార్డు ఉంది. సుదీర్ఘ కాలం అజ్ఞాతంలో గడిపిన ఆయన, ఇటీవల తనతో పాటు మరికొందరు కమాండర్లను కలుపుకుని పోలీసులకు లొంగిపోవాలని నిశ్చయించుకున్నాడు. అయితే, ఈ ప్రతిపాదనను మరో మావోయిస్టు నేత సుక్రుతో పాటు అతడి ప్రధాన అనుచరులు సిలా, జగేష్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే దళం లోపల చెలరేగిన వాగ్వాదం చిలికి చిలికి గాలివానలా మారి, అన్వేష్ హత్యకు దారితీసింది. దారింగ్‌బాడి పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో దొరికిన మృతదేహం ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఈ విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఈ ఘటన మావోయిస్టు కేడర్‌లో నెలకొన్న తీవ్ర అసహనాన్ని, అంతర్గత విభేదాలను బట్టబయలు చేసింది. లొంగుబాటు నిర్ణయాలు తీసుకునే వారిని సొంత దళ సభ్యులే శత్రువులుగా చూస్తున్నారని ఈ ఉదంతం నిరూపిస్తోంది. ఇదిలా ఉండగా, అన్వేష్ హత్యలో పాలుపంచుకున్నట్లు భావిస్తున్న జగేష్ అనే మావోయిస్టు, ఇటీవల కంధమాల్ జిల్లాలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు పోలీసులు ధ్రువీకరించారు.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: గురువారం నాటి ట్రేడింగ్‌లో భారత స్టాక్ మార్కెట్లు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనై చివరికి మిశ్రమంగా ముగిశాయి. హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంకుల షేర్లు లాభపడగా, మీడియా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు నష్టాలను చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బెంచ్‌మార్క్ నిఫ్టీ 14.05 పాయింట్ల స్వల్ప లాభంతో 25,496.55 వద్ద స్థిరపడింది. మరోవైపు, సెన్సెక్స్ 27.46 పాయింట్లు నష్టపోయి 82,248.61 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, హెల్త్‌కేర్ రంగం మార్కెట్‌లో మంచి పనితీరు కనబరిచింది. నిఫ్టీ హెల్త్‌కేర్ ఇండెక్స్ 1.24 శాతం, నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 1.08 శాతం మేర లాభపడ్డాయి. పీఎస్‌యూ బ్యాంకుల షేర్లలో కూడా సానుకూల ధోరణి కనిపించింది. అయితే మీడియా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. నిఫ్టీ మీడియా ఇండెక్స్ 0.68 శాతం, నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ ఇండెక్స్ 0.16 శాతం మేర నష్టపోయాయి. బీఈఎల్, సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడగా, ట్రెంట్, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా మిశ్రమంగానే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.58 శాతం క్షీణించగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ దాదాపు ఫ్లాట్‌గా 0.01 శాతం నష్టంతో ముగిసింది. మరోవైపు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐ), దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐ) మార్కెట్లకు అండగా నిలిచారు. ఫిబ్రవరి 25న ఎఫ్ఐఐలు రూ. 3,024.50 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా, డీఐఐలు రూ. 3,639.97 కోట్ల విలువైన ఈక్విటీలను కొన్నారు. మార్కెట్ పరిమిత శ్రేణిలో కదలాడిందని, హెల్త్‌కేర్ వంటి డిఫెన్సివ్ రంగాలలో మాత్రమే ఎంపిక చేసిన కొనుగోళ్లు జరిగాయని విశ్లేషకులు తెలిపారు. అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో మార్కెట్ ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ, అధిక స్థాయిలలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయని పేర్కొన్నారు. టెక్నికల్‌గా నిఫ్టీ 25,700 స్థాయిని గట్టిగా దాటితేనే మార్కెట్ గమనంలో మార్పు వస్తుందని, అంతవరకు 25,400 మద్దతుగా ఉన్నంతకాలం దిగువ స్థాయిలలో కొనుగోళ్లు కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# రైల్వేలో మాజీ సైనికులకు ఉద్యోగాలు

**ఆర్మీతో రైల్వేశాఖ కీలక ఒప్పందం**



న్యూఢిల్లీ: మాజీ సైనికులు, అగ్నివీరులకు అండగా నిలిచేందుకు భారత రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశ సేవలో రిటైర్ అయిన సైనికులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భారత సైన్యంతో ఒక కొత్త సహకార ఒప్పందం (ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ కోఆపరేషన్) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా, తక్షణమే 5,000 మందికి పైగా మాజీ సైనికులను కాంట్రాక్టు పద్ధతిలో 'పాయింట్స్‌మెన్'గా నియమించుకోనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. సైనిక సేవ నుంచి పౌర జీవితంలోకి మారే సిబ్బందికి ఈ చొరవ ఎంతో భరోసా ఇవ్వనుంది. దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను వేగంగా భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రెగ్యులర్ నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ కాంట్రాక్టు కొనసాగుతుంది. ప్రస్తుతం జోనల్, డివిజనల్ స్థాయిలలో 5,000కు పైగా లెవెల్-1 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని రైల్వే శాఖ తెలిపింది. నియామక ప్రక్రియను సులభతరం చేసేందుకు ఇప్పటివరకు తొమ్మిది రైల్వే డివిజన్లు సంబంధిత ఆర్మీ విభాగాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ నియామకాలను వేగవంతం చేయడానికి రైల్వే డివిజన్లతో చురుకుగా సమన్వయం చేసుకోవాలని ఆర్మీ రిక్రూటింగ్ యూనిట్లను కూడా కోరారు. రిటైర్డ్ సైనిక సిబ్బంది సంక్షేమం, పునరావాసం తమ విధానంలో ముఖ్యమైన భాగమని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే, మాజీ సైనికులకు లెవెల్-2, ఆపై స్థాయి పోస్టులలో 10 శాతం, లెవెల్-1 పోస్టులలో 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఇదే తరహాలో, అగ్నివీరుల కోసం లెవెల్-2, ఆపై స్థాయి పోస్టులలో 5 శాతం, లెవెల్-1 పోస్టులలో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. 2024, 2025 సంవత్సరాల్లో రైల్వే విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లలో మాజీ సైనికుల కోసం మొత్తం 14,788 పోస్టులను రిజర్వ్ చేసినట్లు మంత్రిత్వ శాఖ వివరించింది. ఇందులో 6,485 లెవెల్-1 పోస్టులు, 8,303 లెవెల్-2, ఆపై స్థాయి పోస్టులు ఉన్నాయి. గతంలో గ్రూప్-డిగా పిలిచిన లెవెల్-1 పోస్టులను రైల్వే రిక్రూట్‌మెంట్ సెంటర్ల ద్వారా, లెవెల్-2, ఆపై స్థాయి పోస్టులను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల ద్వారా పోటీ పరీక్షల ద్వారా భర్తీ చేస్తారు. సైనికుల అనుభవాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించుకుంటూనే, వారికి రెండో కెరీర్ అవకాశాలు అందించడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం.

## వయనాడ్‌లో 100 ఇళ్లు

# రాహుల్ గాంధీ శంకుస్థాపన

**40 మంది దుకాణదారులకు 5 లక్షలు**



వయనాడ్: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కలిసి బాధితుల కోసం నిర్మించనున్న 100 ఇళ్ల నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. చురల్మల-ముండక్కాయ్ విపత్తు బాధితులకు ఈ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఈ విపత్తు వయనాడ్ ప్రజల ధైర్యాన్ని, మానవత్వాన్ని ప్రపంచానికి చూపిందన్నారు. "మీరు చాలా కోల్పోయారు, కానీ మీ ధైర్యాన్ని, మానవత్వాన్ని కోల్పోలేదు" అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన తన సోదరి ప్రియాంకతో ప్రయాణంలో జరిగిన ఓ సరదా సంఘటనను పంచుకున్నారు. "నేను మా సోదరితో సరదాగా ఏదో అన్నాను. అప్పటి నుంచి ఆమె నాతో మాట్లాడటం లేదు. ఇక్కడికి ఫ్లైట్‌లో వచ్చేంత వరకు ముభావంగానే ఉంది. కానీ వయనాడ్‌లో అడుగుపెట్టగానే ఆమె మారిపోయింది. మాకు వయనాడ్ అంటే అదే!" అని చెప్పడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ ప్రాంతంతో తమకు రాజకీయాలకు అతీతమైన బంధం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... జూలై 30న విపత్తు జరిగిన వెంటనే తాను ఈ ప్రాంతానికి వచ్చినప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు నేను చూసిన దృశ్యాలు నా జీవితంలో మర్చిపోలేను" అని అన్నారు. ఇళ్లు, జీవనోపాధి, వ్యాపారాలు కోల్పోయిన కుటుంబాల పరిస్థితి తనను కలచివేసిందని చెప్పారు. అప్పటికి, ఇప్పటికి తాను మీ కుటుంబంలో ఒకరిగా మారిపోయానని భావోద్వేగంగా అన్నారు. ఈ సమస్యను పార్లమెంటులో ప్రస్తావించామని, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరామని ప్రియాంక తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి నిలిచారని ప్రశంసించారు. ఈ ప్రాజెక్టు కింద ప్రతి కుటుంబానికి 8 సెంట్ల స్థలంలో 1,100 చదరపు అడుగుల ఇల్లు నిర్మించి ఇవ్వనున్నారు. అలాగే, నష్టపోయిన 40 మంది దుకాణదారులు తమ వ్యాపారాలను తిరిగి ప్రారంభించుకోవడానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు.

## దేశం వీడుతున్న అమెరికన్లు!

**2025లో 1,50,000 మంది విదేశాలకు**

వాషింగ్టన్: అవకాశాల స్వర్గధామంగా పేరుగాంచిన అమెరికాలో అరుదైన పరిణామం చోటుచేసుకుంటోంది. చరిత్రలో ఎన్నడూ లేనంతగా అమెరికన్లు తమ దేశాన్ని విడిచి ఇతర దేశాలకు వలస వెళ్తున్నారు. దాదాపు 90 ఏళ్ల క్రితం మహా మాంద్యం (+తీమ్ఫ్ ణవజూతీవంంఱశీఅ) సమయంలో కనిపించిన ఈ పరిస్థితి ఇప్పుడు పునరావృతమవుతోందని ప్రముఖ ఆర్థిక పత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్ అంచనాల ప్రకారం 2025లో అమెరికా నుంచి వెళ్లిన వారి సంఖ్య వచ్చిన వారి కన్నా ఎక్కువగా ఉంది. దీంతో వలసల్లో సుమారు 1,50,000 మందికి నికర నష్టం వాటిల్లింది. 2023లో దాదాపు 60 లక్షల మంది అమెరికాకు వలస రాగా, 2025 నాటికి ఆ సంఖ్య 27 లక్షలకు పడిపోయింది. మరోవైపు, కేవలం 15 దేశాల పాక్షిక సమాచారం ప్రకారమే గత ఏడాది 1,80,000 మంది అమెరికన్లు ఆ దేశాలకు వలస వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ వలసల వెల్లువకు 'డొనాల్డ్ డాష్' అని కొందరు పేరు పెట్టినా, దీనికి అనేక ఇతర కారణాలు కూడా ఉన్నాయి. అమెరికాలో విపరీతంగా పెరిగిన జీవన వ్యయం, రిమోట్ వర్క్ చేసే సౌలభ్యం, యూరప్ వంటి దేశాల్లో మెరుగైన జీవన ప్రమాణాలు, భద్రత వంటివి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. "అమెరికాలో జీతాలు ఎక్కువైనా, యూరప్‌లో జీవన నాణ్యత బాగుంది. ఇక్కడ ఐదేళ్ల పిల్లలను స్కూల్‌కు పంపితే యాక్టివ్ షూటర్ డ్రిల్స్ చేయాల్సి వస్తుందేమోనన్న భయం లేదు" అని జర్మనీకి వలస వెళ్లిన ఒక అమెరికన్ చెప్పడం అక్కడి సామాజిక ఆందోళనను స్పష్టం చేస్తోంది. ఒకప్పుడు సాహసవంతులు, ఉన్నత విద్యావంతులు మాత్రమే దేశం విడిచి వెళ్లేవారని, ఇప్పుడు సాధారణ మధ్యతరగతి ప్రజలు, కుటుంబాలు కూడా వలసపోతున్నాయని రిలొకేషన్ సంస్థలు చెబుతున్నాయి. పోర్చుగల్‌లో అమెరికన్ల సంఖ్య 500 శాతం పెరగ్గా, ఐర్లాండ్‌లో గతేడాది రెట్టింపు అయింది. అమెరికా పౌరసత్వం వదులుకోవడానికి కూడా దరఖాస్తులు పెరుగుతున్నాయి. అయితే, ఈ వలసలపై వైట్ హౌస్ భిన్నంగా స్పందించింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇతర అభివృద్ధి చెందిన దేశాల కన్నా మెరుగ్గా ఉందని, లక్షలాది అక్రమ వలసదారులను వెనక్కి పంపుతూ, అదే సమయంలో అత్యంత సంపన్నులను 'గోల్డ్ కార్డ్' వంటి పథకాలతో ఆకర్షిస్తున్నామని తెలిపింది. 1935లో ఉపాధి కోసం అమెరికన్లు సోవియట్ యూనియన్‌కు వెళ్లిన తర్వాత మళ్లీ ఇప్పుడు అమెరికా నుంచి నికర వలసలు నమోదు కావడం గమనార్హం.

## భారత్ బడ్జెట్‌లో 'చాబహార్'కు మొండిచేయి

**ఇరాన్ విదేశాంగ మంత్రి అసంతృప్తి!**

టెహ్రాన్: భారత వ్యూహాత్మక ప్రయోజనాలకు అత్యంత కీలకమైన ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు ప్రాజెక్టు భవిష్యత్తుపై సందేహాలు మొదలయ్యాయి. కేంద్ర బడ్జెట్ 2026-27లో ఈ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపును సున్నాకు తగ్గించడంపై ఇరాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హిందూ మహాసముద్రాన్ని మధ్య ఆసియాతో అనుసంధానించే ఈ 'బంగారు ముఖద్వారం' విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయం నిరాశపరిచిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వ్యాఖ్యానించారు. గత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు కోసం మొదట రూ.100 కోట్లు కేటాయించి, ఆ తర్వాత సవరించిన అంచనాల్లో దాన్ని రూ.400 కోట్లకు పెంచిన కేంద్రం, ఈసారి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దౌత్య వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే, ఈ ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. తాము నిధులు నిలిపివేయలేదని, 10 ఏళ్ల ఒప్పందంలో భాగంగా చెల్లించాల్సిన 120 మిలియన్ డాలర్ల మొత్తాన్ని ఇప్పటికే పూర్తిగా చెల్లించేశామని స్పష్టం చేసింది. అందువల్ల ప్రస్తుతానికి కొత్తగా నిధులు కేటాయించాల్సిన అవసరం లేదని వివరించింది. మరోవైపు, ఈ నిర్ణయం వెనుక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ఆంక్షల ప్రభావం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై కఠినంగా వ్యవహరిస్తామని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో భారత్ ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. చాబహార్ ప్రాజెక్టుకు ఉన్న ఆంక్షల మినహాయింపు గడువు కూడా ఏప్రిల్ 26తో ముగియనుండటం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా ఆఫ్ఘనిస్థాన్, మధ్య ఆసియా దేశాలకు సరుకు రవాణా చేయడానికి భారత్‌కు చాబహార్ పోర్టు అత్యంత కీలకం. ఈ ప్రాజెక్టు నుంచి భారత్ వెనక్కి తగ్గితే, ఆ ప్రాంతంలో చైనా తన ప్రాబల్యాన్ని మరింత పెంచుకునే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వారణాసిలో మెక్సికన్ జంట పెళ్లి

**గంగా నదిలో పడవపై వేదమంత్రాల మధ్య వివాహం**

వారణాసి: భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం విశ్వవ్యాప్తంగా ఎంతో మందిని ఆకర్షిస్తున్నాయి. దీనికి నిదర్శనంగా, ఉత్తరప్రదేశ్‌లోని పవిత్ర నగరం వారణాసిలో మెక్సికోకు చెందిన ఓ జంట హిందూ సంప్రదాయ పద్ధతిలో ఒక్కటైంది. కాశీలోని అస్సీ ఘాట్ వద్ద గంగా నదిపై తేలియాడుతున్న పడవలో ఈ అరుదైన వివాహ వేడుక జరిగింది. మెక్సికోకు చెందిన గొంజాలో మిగుయెల్, రూయిజ్ కాబ్రెల్ అనే జంట భారతీయ సంప్రదాయాల పట్ల ఆకర్షితులయ్యారు. తమ పెళ్లిని హిందూ పద్ధతిలో చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ వేడుకలో భాగంగా వరుడు ధోతీ-కుర్తా, తలపాగా ధరించగా, వధువు బనారసీ పట్టుచీరలో భారతీయ వధువులా మెరిసిపోయింది. పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య, అగ్ని సాక్షిగా వీరిద్దరూ ఏడడుగులు నడిచి దంపతులయ్యారు. గంగా నదిపై పడవలో జరిగిన ఈ వినూత్న వివాహాన్ని స్థానికులు, పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. సనాతన ధర్మం ప్రపంచవ్యాప్తంగా పొందుతున్న ఆదరణకు ఈ ఘటనే నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ జంట పెళ్లికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



వయ్యారి చిత్రం






# తాళి కట్టిన శుభవేళ..

## అట్టహాసంగా విరోష్ పెళ్లి వేడుక భావోద్వేగానికి గురైన నేషనల్ క్రష్

టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ - నేషనల్ క్రష్ రష్మిక మందన్న గురువారం ఉదయం ఎట్టకేలకు భార్యాభర్తలుగా ఒక్కటయ్యారు. దీనికి సంబంధించిన మధుర క్షణాలను అభిమానులతో పంచుకున్నారు. రష్మికతో కలిసి ఏడడుగులు నడిచిన ఆ ఎమోషనల్ మూమెంట్స్‌ను విజయ్, నా భర్తను పరిచయం చేస్తున్నా అంటూ రష్మిక సోషల్ మీడియాలో పంచుకోవడంతో అభిమానులు మరింత ఎమోషనల్ అయ్యారు. ఇక ఈ ఫోటోలలో ఇద్దరి నడుమ భావోద్వేగం కూడా కొట్టొచ్చినట్టు కనిపించింది.







## ప్యారడైజ్‌లో అనిరుధ్ కిర్రాక్ మ్యూజిక్

ది ప్యారడైజ్ ఫస్ట్ సింగిల్ తో అనిరుధ్ దుమ్ము లేపుతున్నాడు. అయితే ఓ ఇంట్రెస్టింగ్ అంశం తన లేటెస్ట్ వర్క్ లో కనిపిస్తుంది అని చెప్పాలి. ఇప్పుడు ఏదైతే ఫస్ట్ సింగిల్ లో బీట్స్ తో ఆడియెన్స్ ఓ రేంజ్ లో ట్రాన్స్ లోకి వెళ్లిపోతున్నారో ఇదే మ్యాజిక్ ని గతంలో తాను మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ తో చేసిన 'దేవర'కి కూడా చేసాడు. దేవర చిత్రం అనౌన్సమెంట్ వీడియో ఒకటి వచ్చింది గుర్తుందా? అందులో అనిరుద్ స్కోర్ తో ఆడియెన్స్ కి మెంటలెక్కించాడు. కట్ చేస్తే అదే మ్యూజిక్ తో వదిలిన దేవరకు మాస్ రెస్పాన్స్ సినిమాలో వచ్చింది. ఇప్పుడు కూడా ది ప్యారడైజ్ అనౌన్సమెంట్ వీడియోలో ఇచ్చిన స్కోర్ తోనే వచ్చిన ఫస్ట్ సింగిల్ కి కూడా అదే తరహా రెస్పాన్స్ వస్తుంది.



## బన్నీతో మృణాల్ సినిమా

ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పలు భారీ సినిమాల లైనప్ తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రాల్లో దర్శకుడు అట్లీతో చేస్తున్న భారీ బడ్జెట్ యాక్షన్ సినిమా కూడా ఒకటి. అయితే ఈ సినిమాల్లో హీరోయిన్స్ చాలా మందే ఉంటారు అని వారిలో స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కూడా ఒకరు అంటూ కొన్ని రూమర్స్ ఆ మధ్యన వచ్చాయి కానీ అందులో ఎలాంటి నిజం లేదు అని తేలిపోయింది. కానీ లేటెస్ట్ గా ఐకాన్ స్టార్ పోస్ట్ తో ఈ క్రేజీ కాంబినేషన్ పై హింట్ బయటకి వస్తుంది. ఇటీవల బన్నీ అందుకున్న ఫిల్మ్ ఫేర్ అవార్డు విషయంలో మృణాల్ ఠాకూర్ బెస్ట్ విషెస్ చెబుతూ తనకి గ్రీటింగ్స్ పంపింది. దీనితో ఆమెకి ధన్యవాదాలు తెలుపుతూ ఏదొక రోజు నీతో వర్క్ చెయ్యాలని ఆశిస్తున్నాను అంటూ ఓ కన్ను కొట్టే ఎమోజి పక్కన పెట్టి చిన్నగా హింట్ ఇచ్చాడు. దీనితో ఇప్పుడు అట్లీ సినిమాకి కాకపోయినా ఈ కాంబినేషన్ పడే అవకాశం ఉన్నట్లే.

## పెద్ది సెకండ్ సింగిల్ 'రయ్ రయ్ రా రా..!'



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫస్ట్ సింగిల్ చికిరి సాంగ్ రిలీజైన క్షణం నుంచి సోషల్ మీడియా ట్రెండ్‌లను షేక్ చేస్తూ గ్లోబల్ యాంథెమ్ గా మారింది. ఏఆర్ రెహమాన్ కంపోజ్ చేసిన ఈ సాంగ్ బిలియన్‌కు పైగా రీల్స్‌ను దాటిందన్న సమాచారం ఫ్యాన్స్ లో మరింత ఉత్సాహాన్ని కలిగించగా, ముఖ్యంగా ఈ సాంగ్ లో రామ్ చరణ్ స్టైలిష్ డ్యాన్స్ మూవ్స్ ప్రపంచవ్యాప్తంగా వైరల్ కావడం సినిమాపై క్రేజ్‌ను మరింత పెంచింది. ఇప్పుడు ఆ హైప్‌ను మరింత పెంచేందుకు మేకర్స్ పెద్ది నుంచి సెకండ్ సింగిల్ రయ్ రయ్ రా రా.. సాంగ్ కు రెడీ అయ్యారు. మార్చి 2న హోలీ పండుగ సందర్భంగా ఈ సాంగ్ ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేయగా, ఇది పూర్తి స్థాయి డ్యాన్స్ నంబర్‌గా ఉ ండబోతోందని సమాచారం. ఫస్ట్ సింగిల్ చికిరి సాంగ్ ను మించి ఈ సాంగ్ పాపులారిటీని సాధిస్తుందని యూనిట్ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. అంతే కాదు, ఈ సాంగ్ ను డైరెక్టర్ బుచ్చిబాబు సాన గ్రాండ్ విజువల్ స్పెక్టకిల్‌గా తీర్చిదిద్దినట్టు తెలుస్తోంది. రామ్ చరణ్ స్టైల్, స్వాగ్, ఎనర్జీని పూర్తిస్థాయిలో వినియోగించేలా కొరియోగ్రఫీ ప్లాన్ చేశారట. ప్రతి ఫ్రేమ్‌లోనూ భారీ కాన్వాస్ కనిపించేలా, ఆడియన్స్ ను థియేటర్లలో కుర్చీల్లో కూర్చోనివ్వకుండా చేసేలా ఈ సాంగ్ పిక్చరైజేషన్ ఉంటుందని తెలుస్తోంది. బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తుండగా, ఆమె గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలుస్తుందంటున్నారు. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలో నటించనున్న ఈ పాన్ ఇండియన్ మూవీ విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్ లో వెంకట సతీష్ కిలారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మరి హోలీ సందర్భంగా రాబోతున్న పెద్ది సెకండ్ సింగిల్ ఎన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.

## గాంధీ విగ్రహంతో టీజీకి భారీ ఆదాయం : అన్వేష్




తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న 'మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్' ప్రాజెక్టు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో, ప్రముఖ ట్రావెల్ యూట్యూబర్ అన్వేష్ (నా అన్వేషణ) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయానికి పూర్తి మద్దతు ప్రకటించాడు. విగ్రహాల ఏర్పాటును కేవలం రాజకీయ కోణంలో చూడకూడదని, వాటి వెనుక ఉండే పర్యాటక ఆర్థిక సూత్రాన్ని గమనించాలని పిలుపునిచ్చాడు. గుజరాత్‌లోని 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని ఉదాహరణగా చూపిస్తూ అన్వేష్ ఆసక్తికర విశ్లేషణ చేశాడు.

## ది కేరళ స్టోరీ 2పై స్టే

సినిమా థియేటర్లలోకి రావడానికి సరిగ్గా ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ 2' చిత్రానికి కేరళ హైకోర్టులో భారీ షాక్ తగిలింది. ఈ సినిమాలో మతపరమైన ఉద్రిక్తతలు పెంచేలా, ఒక వర్గాన్ని కించపరిచేలా దృశ్యాలు ఉన్నాయన్న పిటిషన్లను కోర్టు సీరియస్‌గా తీసుకుంది. స్వయంగా సినిమాను వీక్షించిన న్యాయస్థానం, వివాదాస్పద అంశాల దృష్ట్యా విడుదలపై స్టే విధించింది. సెన్సార్ బోర్డు తీరును తప్పుబడుతూ, ఈ చిత్రాన్ని మరోసారి పునఃపరిశీలించాలని ఆదేశించింది. వివరాలలోకి వెళితే .. ఆఖరి నిమిషంలో హైకోర్టు బ్రేక్: ఫిబ్రవరి 27న భారీ అంచనాల మధ్య విడుదల కావాల్సిన 'ది కేరళ స్టోరీ 2- గోస్ బియాండ్' చిత్రానికి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి.

## రన్యా రావుకు ఈడీ షాక్!



బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్ట్ అయి, దాదాపు ఏడాదిగా జైలులో ఉన్న కన్నడ నటి రన్యా రావుకు మరో పెద్ద షాక్ తగిలింది. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బెంగళూరులోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తూ ఆమె పేరును ప్రధాన నిందితుల జాబితాలో స్పష్టంగా ప్రస్తావించింది. ఈ పరిణామం కేసు దర్యాప్తును మరింత తీవ్ర దశకు తీసుకెళ్లినట్టు భావిస్తున్నారు. ఈడీ దాఖలు చేసిన వివరాల ప్రకారం, దుబాయ్ కేంద్రంగా పనిచేసిన ఒక సిండికేట్ ముఠా ద్వారా భారీ స్థాయిలో బంగారం అక్రమ రవాణా జరిగినట్లు ఆరోపణలు ఉ న్నాయి. మొత్తం రూ.102 కోట్ల విలువైన సుమారు 127 కేజీల బంగారాన్ని దుబాయి నుంచి ఇండియాకు అక్రమంగా తరలించినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఈ స్మగ్లింగ్ వ్యవహారంలో రన్యా రావు కీలక పాత్ర పోషించినట్టు, ఆమె నెట్‌వర్క్ అంతర్జాతీయ లింకులు కలిగి ఉన్నట్టు ఈడీ తన ఛార్జ్‌షీట్‌లో వివరించింది. గతేడాది మార్చి 3న 14.2 కేజీల బంగారాన్ని అక్రమంగా తరలించే ప్రయత్నంలో ఆమె పోలీసుల అదుపులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆ అరెస్టు తర్వాత కస్టమ్స్, డీఆర్ఐ సంస్థల దర్యాప్తు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో కేసును ఈడీ స్వీకరించింది. స్మగ్లింగ్ ద్వారా వచ్చిన నిధులను హవాలా మార్గంలో చలామణి చేయడం, వాటిని రియల్ ఎస్టేట్ మరియు ఇతర వ్యాపారాలలో పెట్టుబడులుగా మలచిన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీఎంఎల్‌ఏ చట్టం కింద నమోదైన ఈ కేసులో ఆస్తుల స్వాధీనం, బ్యాంక్ లావాదేవీల ఫ్రీజింగ్ వంటి చర్యలు ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం.





జింబాబ్వేపై భారత్ భారీ గెలుపు

# హమ్మయ్యా.. మనం సేఫ్



## సెమీస్ ఆశలు సజీవం.. బ్యాటింగ్‌లో 256 పరుగుల భారీ స్కోరు

టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో టీమిండియా స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో జింబాబ్వేపై 72 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో పరుగుల వరద పారించిన భారత్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ రాణించి టోర్నీలో తమ సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. భారత్ నిర్దేశించిన 257 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ బ్రయాన్ బెన్నెట్ అద్భుత పోరాటపటిమ కనబరిచాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా, ఏమాత్రం బెదరకుండా భారత బౌలర్లను ఎదుర్కొన్నాడు. కేవలం 59 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 97 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. మరో ఓపెనర్ మరుమణి (20) నెమ్మదిగా ఆడగా, కెప్టెన్ సికందర్ రజా (31) కాసేపు బెన్నెట్‌కు సహకరించాడు. బెన్నెట్, రజా క్రీజులో ఉన్నంతసేపు జింబాబ్వే స్కోరు బోర్డు ముందుకు కదిలింది. కానీ, అప్పటికే సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోవడంతో వారిపై ఒత్తిడి పెరిగింది. రజా ఔటైన తర్వాత జింబాబ్వే ఓటమి ఖాయమైంది. బెన్నెట్ పోరాటం కేవలం ఓటమి అంతరాన్ని తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణించి 4 ఓవర్లలో కేవలం 24 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, శివమ్ దూబే చెరో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (30 బంతుల్లో 55) అద్భుతమైన హాఫ్ సెంచరీతో శుభారంభం అందించాడు. సంజూ శాంసన్ (24), ఇషాన్ కిషన్ (38), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (33) కూడా వేగంగా ఆడారు. చివర్లో హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 50లి), తిలక్ వర్మ (16 బంతుల్లో 44లి) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరూ కేవలం 31 బంతుల్లోనే 84 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 250 దాటించారు. ఈ విజయంతో భారత్ తన సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. సెమీఫైనల్‌కు అర్హత సాధించాలంటే తమ తదుపరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై తప్పక గెలవాల్సి ఉంటుంది. ఈ మ్యాచ్ మార్చి 1న జరగనుంది. అటు, జింబాబ్వేపై టీమిండియా విజయంతో... దక్షిణాఫ్రికా జట్టుకు సెమీస్ బెర్తు ఖరారైంది.

---

# అర్జున్ ఇష్టమైన అమ్మాయిని పెళ్లి చేసుకుంటున్నాడు: సచిన్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఇంట్లో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. సచిన్ కుమారుడు, యువ క్రికెటర్ అర్జున్ టెండూల్కర్ తన చిరకాల స్నేహితురాలు సానియా చందోక్‌తో ఏడడుగులు వేసేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవల జామ్‌నగర్‌లో అంబానీ కుటుంబం ఏర్పాటు చేసిన ప్రీ-వెడ్డింగ్ వేడుకల్లో సచిన్ చేసిన ప్రసంగం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముంబై ఇండియన్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్న ఒక వీడియోలో.. సచిన్ తన కుమారుడి వివాహం గురించి మనసు విప్పి మాట్లాడారు. "మాకు ఇక్కడ ఆతిథ్యం ఇచ్చినందుకు చాలా కృతజ్ఞతలు. ఒక కొడుకు తను ఇష్టపడిన అమ్మాయిని ఇంటికి తీసుకువచ్చి పరిచయం చేశాడంటే.. వాడు పెరిగి పెద్దవాడయ్యాడని అర్థం. అర్జున్, సానియాలు ఒకరినొకరు పిచ్చిగా ప్రేమించుకుంటున్నారు. అర్జున్, నీ విషయంలో నేను చాలా గర్వపడుతున్నాను. నిన్ను ఎంతగానో ప్రేమించే ఒక ప్రత్యేకమైన వ్యక్తి నీకు దొరకడం చాలా సంతోషంగా



ఉంది" అని సచిన్ భావోద్వేగంతో చెప్పారు. అర్జున్ టెండూల్కర్ భార్య కాబోతున్న సానియా చందోక్ కేవలం ఒక సెలబ్రిటీ కోడలు మాత్రమే కాదు.. ఆమెకు స్వయం గుర్తింపు కూడా ఉంది. సానియా ఓ పారిశ్రామికవేత్త, ప్రొఫెషనల్ వెటర్నరీ టెక్నీషియన్. జంతువుల సంరక్షణ కోసం ఓ సంస్థను స్థాపించారు. 2020లో ప్రతిష్ఠాత్మకమైన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమె గ్రావిస్ గ్రూప్ ఛైర్మన్ రవి ఘాయ్ మనవరాలు. ఆమె తల్లిదండ్రులు సన్నీ, గౌరికా కూడా అదే సంస్థలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. అర్జున్, సానియాల వివాహం మార్చి 5వ తేదీన ముంబైలో అత్యంత వైభవంగా జరగనుంది. ఇప్పటికే టెండూల్కర్ కుటుంబం భారత ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలను కలిసి వివాహానికి ఆహ్వానించారు. జామ్‌నగర్‌లో జరిగిన ఈ ప్రీ-వెడ్డింగ్ వేడుకలకు అంబానీ కుటుంబం ఆతిథ్యం ఇవ్వడం విశేషం. క్రికెట్ ప్రపంచంలో 'గాడ్ ఆఫ్ క్రికెట్'గా పిలవబడే సచిన్, ఒక తండ్రిగా తన కొడుకు ఎదుగుదలను చూసి మురిసిపోతుండటం అభిమానులను ఆకట్టుకుంటోంది. అర్జున్-సానియాల జంటకు నెటిజన్లు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

---

# మయాంక్ సెంచరీ

**రంజీ ట్రోఫీ ఫైనల్‌లో.. పోరాడుతున్న కర్ణాటక**

జమ్ము కశ్మీర్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్‌లో కర్ణాటక పోరాడుతోంది. మూడో రోజు ఆట ముగిసేసమయానికి కర్ణాటక 5 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (130లి) శతకం సాధించగా.. అతడితోపాటు క్రుతిక్ కృష్ణ (27లి) క్రీజ్‌లో ఉన్నాడు. వీరిద్దరూ అర్ధశతక (54) భాగస్వామ్యం నిర్మించారు. కేఎల్ రాహుల్ (13), దేవదత్ పడిక్కల్ (11), కరుణ్ నాయర్ (0), స్మరాన్ రవిచంద్రన్ (0) విఫలమయ్యారు. శ్రేయస్ గోపాల్ (23) ఫర్వాలేదనిపించాడు. జమ్ముకశ్మీర్ బౌలర్లలో ఆకిబ్ నబీ 3.. సునీల్ కుమార్, యుద్వీర్ సింగ్ చరక్ చెరో వికెట్ తీశారు. కర్ణాటక ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 364 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో జమ్ముకశ్మీర్ 584 పరుగులకు ఆలౌటైంది. ఈ ఫైనల్‌లో ఇంకా రెండు రోజుల ఆట మాత్రమే మిగిలి ఉంది. మ్యాచ్ ఫలితం తేలకపోతే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విజేతను నిర్ణయిస్తారు. దీంతో కర్ణాటకను త్వరగా ఆలౌట్ చేసేందుకు జమ్ముకశ్మీర్ బౌలర్లు ప్రయత్నిస్తున్నారు.

---

# నాడు భారత్‌తో మ్యాచ్ అంటేనే వేరు

భారత్-పాకిస్థాన్ క్రికెట్ పోరు అంటే కేవలం మైదానంలో ఆట మాత్రమే కాదు.. అది ఒక భావోద్వేగం, ఒక యుద్ధం. అప్పట్లో 90వ దశకంలో వసీం అక్రమ్, వకార్ యూనిస్, సక్లైన్ ముస్తాక్, షోయబ్ అక్తర్ వంటి దిగ్గజ బౌలర్లు భారత్‌ను వణికించేవారు. ముఖ్యంగా సచిన్ టెండూల్కర్‌ను అవుట్ చేయడం అంటే వారికి అదొక గౌరవం, ఒక పెద్ద పందెం. ఆనాటి పంతాలు, పంతాల వెనుక ఉన్న నొప్పిని రావల్పిండి ఎక్స్‌ప్రెస్ తాజాగా బయటపెట్టింది. అప్పట్లో సచిన్ టెండూల్కర్ వర్సెస్ షోయబ్ అక్తర్ మధ్య సాగిన పోరాటం నేటికీ అభిమానుల గుండెల్లో సజీవంగా ఉంది. ఇండియా-పాకిస్థాన్ మధ్య 1999 కోల్‌కతా టెస్టును క్రికెట్ అభిమానులు ఎవరూ మర్చిపోలేరు. ఆ మ్యాచ్‌లోనే అప్పటికి పెద్దగా తెలియని పాకిస్తాన్ యువ పేసర్ షోయబ్ అక్తర్ భారత దిగ్గజాలు రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్‌లను వరుస బంతుల్లో క్లీన్‌బౌల్డ్ చేశాడు. అక్తర్ సంధించిన పర్ఫెక్ట్ యార్కర్లకు ఈ దిగ్గజ క్రికెటర్లు పెవిలియన్ బాట పట్టడంతో ఒక్కసారిగా ఈడెన్ గార్డెన్స్ నిశబ్ధమైపోయింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్తర్ మాట్లాడుతూ.. 1998-99 నాటి పాక్ భారత పర్యటనను గుర్తు చేసుకున్నాడు. ఒక షాకింగ్ నిజాన్ని వెల్లడించాడు.

---

### భారత్‌కు ఊరటనిచ్చిన

# సఫారీలు

## వెస్టిండీస్‌పై సౌతాఫ్రికా ఘన విజయం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో సౌతాఫ్రికా జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుస విజయాలతో లీగ్ దశను అజేయంగా ముగించిన సఫారీ టీమ్.. సూపర్-8 దశలోనే అదే జోరు కొనసాగిస్తోంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పటిష్ట భారత్‌ను మట్టికరిపించిన మార్క్‌రమ్ సేన.. తాజాగా డేంజరస్ టీమ్ అయిన వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. గురువారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన తమ రెండో సూపర్-8 మ్యాచ్‌లో సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించి విండీస్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో సౌతాఫ్రికా గ్రూప్-1 నుంచి సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకోగా వెస్టిండీస్ సంక్లిష్టం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు చేసింది. జాసన్ హోల్డర్(31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49), రొమారియో షెఫర్డ్(37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52 నాటౌట్) అసాధారణ ప్రదర్శన కనబర్చారు. ఈ ఇద్దరూ 8వ వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి(3/30) మూడు వికెట్లు తీయగా.. కగిసో రబడా, కార్బిన్ బోష్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం సౌతాఫ్రికా 16.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 177 పరుగులు చేసి గెలుపొందింది. ఎయిడెన్ మార్క్‌రమ్(46 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 82 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. క్వింటన్ డికాక్(24 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 47), ర్యాన్ రికెల్టన్(28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 45 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్ ఒక వికెట్ తీసాడు. సౌతాఫ్రికా విజయంతో టీమిండియా సెమీస్ అవకాశాలు మెరుగయ్యాయి. ఎలాంటి రన్‌రేట్ టెన్షన్ లేకుండా జింబాబ్వేతో పాటు వెస్టిండీస్‌తో తమ తదుపరి మ్యాచ్‌లను భారత్ గెలిస్తే సరిపోతుంది. ఇందులో ఒక్క మ్యాచ్ ఓడినా ఇంటిబాట పడుతుంది. మరోవైపు ఈ ఘోర పరాజయంతో వెస్టిండీస్ రన్‌రేట్ కూడా భారీగా పడిపోయింది. ం5.350 నుంచి 1.791కు వెస్టిండీస్ రన్ రేట్ తగ్గింది. భారత్‌తో జరిగే తమ ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే విండీస్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పట్టనుంది.




# న్యాయవ్యవస్థ గౌరవం- విద్యా ప్రణాళికల పరిమితులు

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ రూపొందించిన 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే అంశాన్ని చేర్చడంపై సుప్రీంకోర్టు ఫిబ్రవరి 26, 2026న తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ పుస్తకంపై పూర్తి నిషేధం విధించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యాకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిని న్యాయవ్యవస్థను కించపరిచే కుట్రగా అభివర్ణించింది. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన మూలస్తంభం. సమాజంలో ప్రజలకు ఈ వ్యవస్థపై ఉన్న అపారమైన నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా పాఠ్యాంశాలు ఉండటం ఆందోళనకరం. విద్యార్థులకు వ్యవస్థల పనితీరును నేర్పించడం అవసరమే అయినప్పటికీ, లేత వయస్సులోనే లోతైన వివరణలు లేకుండా కేవలం అవినీతి వంటి అంశాలపై దృష్టి పెట్టడం వల్ల వ్యవస్థ పట్ల వ్యతిరేకత ఏర్పడే ప్రమాదం ఉందని కోర్టు పేర్కొంది. కేవలం న్యాయవ్యవస్థలోనే అవినీతి ఉందని చూపే విధంగా కాకుండా, ఇతర వ్యవస్థలలో (రాజకీయాలు, అధికార యంత్రాంగం) ఉన్న సవాళ్లను ప్రస్తావించకుండా దీన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సరికాదని న్యాయవాదులు వాదించారు. ఏ వ్యవస్థ అయినా విమర్శలకు అతీతం కాదు. అయితే, ఆ విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి. ముఖ్యంగా భావి భారత పౌరులైన విద్యార్థులకు పాఠాలు చెప్పేటప్పుడు సమతుల్యత పాటించడం అవసరం. న్యాయవ్యవస్థలో సంస్కరణల గురించి చర్చించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆ చర్చ వ్యవస్థను బలహీనపరిచేలా కాకుండా, బలోపేతం చేసే దిశగా సాగాలి.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం





"Justice delayed is justice denied"


On account of multiple reasons, such as a lack of an adequate number of judges, complicated legal procedures, and poor infrastructure, the judicial system in our country has a massive backlog. Look at the data from the National Judicial Data Grid given below (as of March 2025):

| Number of pending cases (approximate): | |
|---|---|
| Supreme Court | 81,000 |
| High Courts | 62,40,000 |
| District and other Subordinate Courts | 4,70,00,000 |

*Note: These numbers need not be memorised.*

While the number of pending cases shows part of the problem, the real issue is the long time it takes to resolve a case in court. In the High Courts, for example, nearly three-fourths of pending cases have been unresolved for over a year, and half of them have been pending for more than three years. Some cases have even remained unresolved for more than 50 years!

It is important that the people feel that their case has been heard by the court and that justice has been delivered in a timely manner. When cases are not resolved within a reasonable time, those who approach the court often feel that justice has been denied




## చారిత్రాత్మక నవల 'కొండమల్లు'

కాలమొక్క అనంత ప్రవాహం. అందులో ఊహాత్మకంగానూ కాల్పనికంగానూ సృజనాత్మకంగానూ ముందుకు వెళ్ళవచ్చు కానీ వెనక్కి వెళ్లాలనుకున్నప్పుడు మాత్రం నిజాలతోనూ అబద్ధాలతోనూ కలగలిపిన చారిత్రక సంఘటనలు మౌఖిక వాంగ్వయం ద్వారా వివిధ రూపాల్లో అంటే కథలుగా జానపద గాథలుగా ప్రచారంలో ఉంటాయి.కొన్ని కులాలు, కొన్ని వర్గాలు మాత్రమే వర్ణించి చెప్పే కథలు ప్రచారంలో ఉంటాయి. ముఖ్యంగా మహాభారతాన్ని పోలిన కథగా చరిత్ర చెప్పుకునే పల్నాటి చరిత్ర కాలక్రమేన కులాల ఆధిపత్యాలలోనూ, ప్రాంతీయ ఆధిపత్యాలలోనూ చిక్కుకున్న చరిత్ర. మంచిని చెడుగాను, చెడును మంచిగాను వక్రీకరించే ప్రయత్నం జరిగి ఉండవచ్చు. అదృష్టవశాత్తు ఉమ్మడి రాష్ట్రాన్ని. విభజిత రాష్ట్రాన్ని చూస్తున్న మనం చాపకూడుతో సమ సమాజ స్థాపనకు కృషి చేశాడు అన్న బ్రహ్మన్న జానపద గాథల్లో మాత్రం ప్రతి నాయకుడుగానే ఉండడం రాతి మీద రాత కన్నా మౌఖిక గాథలే నిజాన్ని అందించాయని చెప్పవచ్చు. వీటిని చెవి ఒగ్గి వినే ఓపిక, ఆసక్తి మనకు ఉండాలి.అలా ప్రయత్నించి, పయనించి,విని రికార్డు చేసుకున్న రచయిత ప్రతి ఒక్క చెట్టు, పుట్టా, కూడు, గూడు, గూడెం,పల్లె,లోయ, కొండ, కుర్రు, జీవం, ఒర్రె,పాయ ప్రతి ఒక్క విషయాన్ని విడమర్చి వర్ణించిన వర్ధెల్లి వెంకటేశ్వర్లుకు కొండమల్లు నవల ద్వారా అజరామర కీర్తిని, స్థానాన్ని కట్టబెట్టవలసిందే. ఇలాంటి ప్రయత్నం ఒకటి చేయొచ్చని మామూలు సాహిత్యాభిమానులు ఎవరికీ కనీసం ఊహకైనా అందదు. అలాంటిది 900 సంవత్సరాల వెనక్కి వెళ్లి శోధించి, సాధించడం అనూహ్యమైన ఆలోచన. నేను కూడా దశాబ్దం క్రితం ఉద్యోగరీత్యా చెంచు పెంటలను తిరిగి కొన్ని జ్ఞాపకాలు పదిల పరుచుకున్నాను. ఏదైనా అడిగితే దూరంగా వెళ్లి కిచకిచమని నవ్వుకున్న చెంచు మహిళలను చూసి వీళ్ళు ఎప్పుడు నాగరిక సమాజంతో కలుస్తారా అనుకునేదాన్ని.

# "చెట్టు కింద సంక్రాంతి"

జగదేవపురం, ఆ ఊరి చివరన ఒక పెద్ద మర్రిచెట్టు. చెట్టు కింద ఎప్పుడూ సందడి. కానీ ఆ రోజు సందడి మరింత ఎక్కువగా ఉంది. ఎందుకంటే.. సంక్రాంతి! మర్రిచెట్టు మీద ఉన్న కాకి కార్తీక ముందుగా గమనించింది. "ఓహో! మానవులు ఇళ్ల ముందు రంగవల్లుల్లు వేస్తున్నారు. గాలిలో నువ్వుల వాసన... బెల్లం తీపి... ఇది ఖచ్చితంగా సంక్రాంతే!" అని కావు మంటూ కేక వేసింది. చెట్టు కింద గడ్డిలో పడుకుని ఉన్న ఎద్దు బలరాముడు మెల్లగా లేచి, "అవునే! నిన్న మా యజమాని నా కొమ్ములకు పసుపు రాసాడు. ఈసారి నన్ను ట్రాక్టరుకు కట్టడు అనుకుంటా!" అంటూ గర్వంగా నిటారుగా నిలబడ్డాడు. అది విని పక్కనే ఉన్న మేక చిట్టి నవ్వుతూ, "నీకేమి బలరామా! నిన్న మా ఇంట్లో కొత్త తాళ్ళు పేనారు. నాకు మాత్రం కొత్త తాడే గిఫ్ట్!" అని చిలిపిగా అంది. అంతలో చెట్టు మీద నుంచి ఒక గబ్బిలం వేలాడుతూ, "అందరూ పగలు పండుగ చేసుకుంటే, రాత్రి పండుగ మాదే!" అని గంభీరంగా చెప్పింది.

అప్పటికే ఆ చెట్టు చుట్టూ...పక్షులు, జంతువులు అన్నీ చేరిపోయాయి. పావురం శాంతి తన రెక్కలు సర్దుకుంటూ, "సంక్రాంతి అంటే నాకు చాలా ఇష్టం. మానవులు గింజలు చల్లుతారు. ఆకలేమీ ఉండదు!" అంది. చిలుక మిథున్ మాత్రం, "నాకు భోగి ఇష్టం. ఆ రోజు పాత వస్తువులు కాలుస్తారు. ఆ పొగలోంచి మనం ఎగురుతుంటే.. ఆహా!" అని ఆనందంగా ఊగిపోయాడు. అప్పుడే గాలిలో చక్కర్లు కొడుతూ గాలిపటం చిక్కుకుంది చెట్టు కొమ్మకి.

అది చూసిన పిట్ట బుజ్జి, "ఇదేంటి ఆకాశపు పూలా?" అని ఆశ్చర్యపోయింది. కాకి కార్తీక వెంటనే చెప్పింది, "అది గాలిపటం. మనుషులు ఆకాశంతో ఆటలాడే రోజు ఇది!" ఆవు గౌరీ నెమ్మదిగా చెట్టు కింద కూర్చుని, "సంక్రాంతి అంటే కృతజ్ఞత. మానవులు మమ్మల్ని పూజిస్తారు. పాలిచ్చే మా శ్రమకు ఇది గౌరవం," అంది. అది విని కుక్క శేఖర్ తోక ఊపుతూ, "నాకు మాత్రం సంక్రాంతి అంటే ఎముకల పండుగ! ఇంటింటా వంటలు... నాకు విందే విందు!" అని సంతోషంగా మొరిగాడు. అంతలో పిల్లి లిల్లీ నెమ్మదిగా ముందుకు వచ్చి, "మీరందరూ సంతోషపడుతున్నారు. కానీ ఆ భోగి మంటలు... మా చిన్న పిల్లలకు భయం," అని కొంచెం బాధగా అంది. అది విన్న వెంటనే ముసలి తాబేలు తాతయ్య, "అందుకే పండుగ అంటే ఆనందమే కాదు... ఆలోచన కూడా ఉండాలి," అని నిదానంగా అన్నాడు.

----

మరుసటి రోజు ఉదయం. సూర్యుడు మెల్లగా తన కిరణాలు వెదజలల్లుతున్నాడు. గాలిలో మేళ తాళాల శబ్దం. పొలాల్లో కోతకు సిద్ధమైన పంటలు బంగారు వర్ణంతో గాలికి ఊగుతూ సూర్యుడి కిరణాలతో పోటీ పడుతున్నాయి. పక్షులు అన్నీ తమ మధుర స్వరంలో కూస్తున్నాయి. జంతువులన్నీ ఒక చోట చేరాయి. కోడి కర్రోడు గర్వంగా ముందుకు వచ్చి, "ఈ రోజు నా రోజు! కోడిపందాలు అంటూ మనుషులు చెబుతారు...

కానీ నిజానికి నేను తెల్లవారు జామున అందరినీ లేపే ప్రకృతి గంటను!" అని అరిచాడు. అది విని గుడ్లగూబ నవ్వుతూ, "సరే సరే.. రాత్రి మేమే రాజులం!" అంది. అంతలో పిట్ట బుజ్జి ఒక్కసారిగా చెప్పింది, "మనందరికీ పండుగ ఉంది కదా.. మనం కూడా మనుషుల్లా ఒక చిన్న సంక్రాంతి జరుపుకుందాం!" అందరూ ఆశ్చర్యంగా చూశారు. "మన పండుగలో ఏం చేస్తాం?" అని మేక చిట్టి అడిగింది. బలరాముడు ఆలోచించి, "మనమంతా కలిసి చెట్టు కింద కూర్చొని, ఎవరికీ హాని లేకుండా, ప్రకృతిని గౌరవిస్తూ పండుగ చేసుకుందాం," అన్నాడు. పక్షులు గానం చేస్తాయి,జంతువులు కథలు చెబుతాయి. ఎవరూ ఎవరినీ భయపెట్టరు. ఎవరూ ఎవరినీ తక్కువ చేయరు అంది. అన్నీ సంబరంగా ఎగిరి గంతేసి ఒప్పుకున్నాయి. కాకి కార్తీక అంది, "మనుషులు ఒకరినొకరు విడిచిపెట్టినా, పండుగలకైనా కలుస్తారు. మనం మాత్రం రోజూ కలిసి ఉండాలి." పావురం శాంతి, శాంతి సందేశం ఇచ్చింది. కుక్క శేఖర్ విశ్వాసం గురించి మాట్లాడాడు. ఆవు గౌరీ సహనం గురించి చెప్పింది. తాబేలు తాతయ్య కాలం విలువ గురించి వివరించాడు. చివరగా చిన్న పిల్లి లిల్లీ అంది, "పండుగ అంటే భోగి మంటలు మాత్రమే కాదు... మన మనసుల్లో వెలుగు." అది విన్న ప్రతి పక్షి రెక్కలు విప్పార్చింది. ప్రతి జంతువు తల ఊపింది.

"సూర్యుడు అస్తమిస్తున్నాడు. మనుషులు తమ ఇళ్లలో ఆనందంగా ఉన్నారు. చెట్టు కింద పక్షులు--జంతువులు కూడా! ఆ మర్రిచెట్టు మెల్లగా గాలికి ఊగుతూ అనుకుంది. "సంక్రాంతి అంటే వండుకు తినడం కాదు, అనుబంధాలు పంచుకోవడం. పండుగ అంటే శబ్దం కాదు... స్నేహం." అలా ఆ చెట్టు కింద ప్రకృతి తన సంక్రాంతిని జంతు సమూహంతో ఆనందంగా జరుపుకుంది. చదువుతున్న మీరేమంటారు?! మనము వెళ్దాం వస్తారా!!"


**- రమాదేవి కులకర్ణి**
**హైదరాబాద్, 8985613123**

## జ్ఞాపకాల తెర(ఫొటో ఫ్రేమ్)

జీవిత గమనంలో
మనం వేసే ప్రతి అడుగుని
అడుగు జాడల్ని భద్రంగా అమర్చే అర
సజీవ చిత్రంగా గతాన్ని
స్వగతాన్ని బంధించే జ్ఞాపకాల తెర
అనుభవాలు అనుభూతులు
కాల చక్రంలో కనుమరుగయినా
చిన్ని రంగుల చట్రంలో
చిత్రంగా ఇమిడిపోయే అద్భుత వీక్షిక
నిన్నటి ప్రపంచాన్ని నిమిషాల్లో
కళ్ళ ముందు నిలిపే జ్ఞాపిక
నేటి ప్రపంచాన్ని
రేపటి లోగిళ్ళలో దాచే చిత్రిక
ఈ ఫోటో ఫ్రేమ్‌లో
దాగిన ఛాయా చిత్రం
చరిత్రకి సజీవ సాక్ష్యం
వర్తమానానికి నిండైన రూపం

- డాక్టర్ రనవేయిన రమేశ్
ఎంఎస్, ఈఎన్టీ





## విజయ పతాకలు

ఆకురాలిన ప్రతి సారి చెట్టు
కొత్త అనుభవానికి
తెర తీస్తుంది!

నేనూ అంతే
గాయపడినప్పుడల్లా
కొత్త గీతమై మెరుస్తాను!

ప్రవహిస్తేనే కదా
అడ్డంకులు మొలిచేది
అధిగమిస్తేనే కదా నదినయ్యేది!

శిఖరమెక్కిన వానికి
నేల మీద నుంచున్న వాళ్ళు
చీమల్లా అగుపిస్తారు!

దూరం విస్తరిస్తే
ఎంత ఎత్తున ఉన్నోడైనా
కొండెక్కిన దీపమే!

అకస్మాత్తుగా
ఆకాశమెత్తు ఎదిగి
కుప్పకూలిన వాళ్ళనెందరిని చూడలేదు?!

నీ జీవన యాత్ర పొడవెవనికి కావాలి
ఈ మట్టి మీద మెరిసే నీ పాదముద్రలే
నీ ఉనికికి విజయ పతాకలు!!

-కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.